



PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 90, పేజీలు - 08
గురువారం, సెప్టెంబర్ 4, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD








## పోటెత్తిన యమున

2లో..



## భారత్ సుంకాలు విధిస్తూ చంపేస్తోంది

2లో..



## హైదరాబాద్ గణేశ్ నిమజ్జనానికి హాజరుకానున్న అమిత్ షా

2లో..

# పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా

- హరీష్, సంతోష్ లు బీఆర్ఎస్ ను జలగల్లా పట్టిపీడిస్తున్నారన్న కవిత
- ప్రాణం పోయినా కేసీఆర్ కు అన్యాయం జరగనివ్వనని వ్యాఖ్య
- ఆరడుగుల బుల్లెట్ తనను గాయపరిచిందని మండిపాటు
- ఉపఎన్నికలో ఈటలను హరీష్ గెలిపించారని ఆరోపణ
- ఈ విషయాలు కేసీఆర్, కేటీఆర్ గమనించాలని సూచన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ తనపై సస్పెన్షన్ వేటు వేయడంపై కవిత తీవ్రంగా స్పందించారు. ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టుగా కవిత ప్రకటించారు. ఇందుకు సంబంధించి రెండు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖలో పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని, తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. అలాగే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్టుగా శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి కూడా లేఖ రాశారు.బీఆర్ఎస్ పార్టీ తనపై సస్పెన్షన్ వేటు వేయడంపై కూడా కవిత స్పందించారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ తాను జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కొంత విరామం తీసుకుని, 2024 నవంబర్ నుంచి ప్రజా సమస్యలపై పోరాడానని, పార్టీ శ్రేణులను కూడా కలుపుకుని ముందుకు వెళ్లానని చెప్పారు. ఇవన్నీ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు ఎలా అవుతాయని ప్రశ్నించారు. తాను అధికార కాంగ్రెస్‌పై పోరాడితే బీఆర్ఎస్‌లోని కొందరు తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. సామాజిక తెలంగాణ కోసం కట్టుబడి ఉన్నానంటే అందులో తప్పేముందని ప్రశ్నించారు. సామాజిక తెలంగాణ నినాదానికి బీఆర్ఎస్ వ్యతిరేకమా? అని ప్రశ్నించారు. తన తండ్రి కేసీఆర్ బంగారు తెలంగాణ నినాదంతో ముందుకు సాగారని, అయితే హరీష్ రావు ఇంట్లో, సంతోష్ కుమార్ ఇంట్లో బంగారం ఉంటే బంగారు తెలంగాణ

2లో..

ఉగ్రవాదంపై భారత్ పోరుకు
# జర్మనీ మద్దతు

- ఆత్మరక్షణ హక్కు భారత్‌కు ఉందని స్పష్టీకరణ
- ఢిల్లీలో జైశంకర్, జర్మనీ మంత్రి సమావేశం
- మరింత పెరగనున్న ఇరుదేశాల రక్షణ సహకారం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఉగ్రవాద దాడుల నుంచి తమ ప్రజలను కాపాడుకునేందుకు భారత్‌కు పూర్తి ఆత్మరక్షణ హక్కు ఉందని జర్మనీ స్పష్టం చేసింది. ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటంలో ఉన్న న్యాయాన్ని తాము అర్థం చేసుకున్నామని తెలిపింది. భారత పర్యటనకు వచ్చిన జర్మనీ విదేశాంగ మంత్రి జోహాన్ వాడెపుల్‌తో

2లో..

కనీసం ఒక యూరియా బస్తా
# అందించలేరా.?

## - చంద్రబాబు సర్కారుపై జగన్ ఫైర్




అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందని, రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని వైసీపీ అధినేత జగన్ ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంపై ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' అని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రైతులకు కనీసం ఒక యూరియా బస్తాను కూడా అందించలేని దుస్థితిలో ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రైతులు యూరియా బస్తా కోసం రోజుల తరబడి క్యూ లైన్లలో నిలబడాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడిందని జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఎరువుల కష్టాలు తప్పడం లేదని మండిపడ్డారు. ఇదే సమయంలో ఉల్లి, చీనీ, మినుము వంటి పంటల ధరలు కూడా పతనమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నా, ప్రభుత్వంలో

2లో..

బుద్ధిలేదా .. ప్రతిపక్ష హోదా
# ఇవ్వాల్సింది ప్రజలు

## - వైఎస్ఆర్‌సీపీకి చంద్రబాబు చీవాట్లు



**అమరావతి** అసెంబ్లీకి రావాలంటే జగన్ ప్రతిపక్ష హోదా ఇవ్వాలని వైఎస్ఆర్‌సీపీ నేతలు చేసిన డిమాండ్ పై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష హోదా డిమాండ్ చేస్తే సరిపోదని, అది ప్రజలు ఎన్నికల ద్వారా ఇచ్చే హక్కు అని స్పష్టం చేశారు. "ప్రతిపక్ష హోదా కావాలని అడిగితే ఇచ్చేస్తామా? ముఖ్యమంత్రి పదవి కావాలని అడిగినా ఇచ్చేస్తామా? ఏ హోదా అయినా ప్రజలు ఇస్తారు," అని చంద్రబాబు అన్నారు. అమరావతిలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కోసం రాజ్యాంగ నిబంధనలు, ప్రజాతీర్పు కీలకమని వివరించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా అంశం ఇటీవలి సమావేశాల్లో వివాదాస్పదంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ, 175 స్థానాలున్న అసెంబ్లీలో 11 సీట్లతో ఏకైక ప్రతిపక్ష పార్టీగా ఉన్నామని, ప్రతిపక్ష హోదా తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ప్రతిపక్ష హోదా కోసం కనీసం 10% సీట్లు అంటే 18 సీట్లు ఉండాలనే రాజ్యాంగ నిబంధనను వైసీపీ అందుకోలేదని అంటున్నారు. "ప్రతిపక్ష హోదా కావాలని అడిగితే సరిపోదు. ముఖ్యమంత్రి పదవి కావాలని అడిగినా ఇవ్వలేం. ఏ హోదా అయినా ప్రజలు

2లో..

# చెత్తగాళ్ల వెనుక నేనెందుకుంటా

## - బీఆర్ఎస్ పరిణామాలపై రేవంత్ కౌంటర్

- హరీశ్ వెనుక రేవంత్ ఉన్నారన్న కవిత
- ప్రజలు తిరస్కరించిన వాళ్ల వెనుక తాను ఎందుకుంటానన్న రేవంత్
- బీఆర్ఎస్ మునిగిపోతున్న నావ అని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) చెత్తగాళ్ల వెనుక తానెందుకు ఉంటానని తనకు అంత సమయం లేదని సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పరిణామాలపై వ్యాఖ్యానించారు. ఒకరిపై ఒకరు యాసిడ్ దాడులు చేసుకుంటున్నారన్నారని విమర్శించారు. హైదరాబాద్ లో ఓ కార్యక్రమంలో మాట్లాడిన రేవంత్ సూటిగానే బీఆర్ఎస్ అధినేత ఫ్యామిలీలో ఏర్పడిన వివాదం విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీని బతకనివ్వబోమని ఆనాడు అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టారని గుర్తు చేసుకున్నారు. ఇవాళ వాళ్ళేతన్నుకుని చస్తున్నారు, ఒకరినొకరు కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటున్నారని అన్నారు. ఎవరూ అక్కర్లేదు వాళ్లను వాళ్ళే పొడుచుకుంటారన్నారని తేల్చేశారు.

### నేను నాయకుడిని.. ఉంటే ముందుంటా

అవినీతి సొమ్ము పంపకాల్లో తేడా వచ్చి కుటుంబంలో తగాదాలు పెట్టుకుంటున్నారని ఆరోపించారు. పాపం ఊరికే పోదన్నారు. ఆ పాపాలు వెంటాడుతూనే ఉంటాయి, ఖచ్చితంగా అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు. ఒకరివెనక ఒకరు ఉన్నారని

2లో..



## బాణం కేటీఆర్ మీద నుంచి హరీష్ వైపు తిప్పారు

- కవిత కేసీఆర్ వదిలిన బాణమని భావిస్తున్నానన్న మహేశ్ కుమార్ గౌడ్
- కవిత చెప్పిన విషయాలు వాస్తవమేనన్న టీపీసీసీ చీఫ్
- పంపకాల్లో విభేదాలు వచ్చి పరస్పరం తిట్టుకుంటున్నారని వ్యాఖ్య

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అమెరికా పర్యటన అనంతరం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కవిత ఇంతకాలం కేటీఆర్ మీద గురి పెట్టిన తన బాణాన్ని ఇప్పుడు హఠాత్తుగా హరీశ్ రావు వైపు మళ్లించారని ఆయన వ్యాఖ్యానించారు. కవితను కేసీఆర్ వదిలిన బాణంగా తాను భావిస్తున్నానని, ఇది కేసీఆర్ కుటుంబంలో జరుగుతున్న కొత్త నాటకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, కవిత చెబుతున్న విషయాలన్నీ వాస్తవమేనని, బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో

2లో..

కాళేశ్వరం అవినీతి నుండి
## దృష్టి మరల్చేందుకు కవిత అంశం

2లో..

- ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఎందుకు అప్పగించడం లేదని ప్రశ్న



## షూస్, చెప్పులు, బట్టలు మరింత చౌకగా

### - జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. ఈ నిర్ణయాలు ఒక వైపు సామాన్య వినియోగదారులకు ఉపశమనం కలిగిస్తే మరోవైపు రాష్ట్రాల ఆదాయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు రూ. 1,000 వరకు ధర ఉన్న షూస్, దుస్తువులపై 5శాతం జీఎస్టీ ఉండేది. రూ. 1,000 కంటే ఎక్కువ ధర గల వాటిపై 12శాతం పన్ను విధిస్తుండే.

2లో..

## కాళేశ్వరం నివేదికపై స్టేకు హైకోర్టు నిరాకరణ

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్కే జోషి దాఖలు చేసిన పిటిషన్
- సాక్షిగా పిలిచి నివేదికలో ఆరోపణలు చేశారని ఆవేదన
- పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికపై స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. ఈ నివేదికను నిలిపివేయాలని కోరుతూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషి

2లో..

## స్థానిక సంస్థల బలోపేతంపై ప్రభుత్వానికి కీలక సిఫార్సులు

### - రాష్ట్ర 5వ ఆర్థిక సంఘం సభ్యులతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమావేశం



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల బలోపేతానికి ఉద్దేశించిన పలు కీలక సిఫార్సులతో కూడిన నివేదికను రాష్ట్ర 5వ ఆర్థిక సంఘం ప్రభుత్వానికి అందజేసింది. బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ఆర్థిక సంఘం సభ్యులు సమావేశమై ఈ నివేదికను సమర్పించారు. ఆర్థిక సంఘం ఛైర్ పర్సన్ రత్నకుమారి, సభ్యులు ప్రసాదరావు, కృపారావు ఈ భేటీలో పాల్గొన్నారు.

2లో..

# పోటెత్తిన యమున

## - చెరువుల్లా మారిన ఢిల్లీ వీధులు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీని యమునా నది వరదలు ముంచెత్తాయి. నది ఉగ్రరూపం దాల్చడంతో అనేక లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వీధులు చెరువులను తలపిస్తుండగా, మార్కెట్లు, ఇళ్లు నీటమునిగాయి. బుధవారం మధ్యాహ్నం 1 గంట సమయానికి యమునా నది నీటిమట్టం ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. హథినీకుండ్ బ్యారేజీ నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతో యమునా నది పోటెత్తింది. దీంతో వసుదేవ్ ఘాట్, యమునా ఘాట్‌లతో పాటు మజ్ను కా టిలా, మదన్‌పూర్ ఖదర్, బదర్‌పూర్ వంటి నివాస ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. అధికారులు ముందుజాగ్రత్త చర్యగా పాత రైల్వే బ్రిడ్జిపై రాకపోకలను నిలిపివేసి, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, తాత్కాలిక శిబిరాలకు తరలించారు. అయినప్పటికీ, వరద ప్రభావిత ప్రాంతాల్లో హృదయ విదారక దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. సర్వం కోల్పోయిన ప్రజలు కట్టుబట్టలతో రోడ్లపైకి వచ్చి, సహాయం కోసం ఎదురుచూస్తున్నారు.ఒకప్పుడు రద్దీగా ఉండే మజ్ను కా టిలా మార్కెట్ ఇప్పుడు నిశ్శబ్దంగా మారింది. వరద నీరు దుకాణాల్లోకి చేరడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. "రాత్రికి రాత్రే దుకాణం ఖాళీ చేశాం. చాలా సరుకులు కాపాడుకున్నా, కొన్ని పాడైపోయాయి. వరద తగ్గాక దుకాణానికి మరమ్మతులు చేయాలంటే పెద్ద ఖర్చు అవుతుంది," అని దుకాణదారుడు అనుప్ థాపా ఆవేదన వ్యక్తం చేశారు. 2023 తర్వాత మళ్లీ ఇలాంటి పరిస్థితి రావడం ఇది రెండోసారని, ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు. మదన్‌పూర్ ఖదర్‌లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. తమ పూరి గుడిసెలు నీటిలో మునిగిపోవడంతో వందలాది కుటుంబాలు రోడ్డు పక్కన ప్లాస్టిక్ షీట్ల కింద తలదాచుకుంటున్నాయి. "మా సామాన్లన్నీ ఇంట్లోనే ఉండిపోయాయి. కొన్ని మాత్రమే తెచ్చుకోగలిగాం. ముఖ్యంగా మహిళలు టాయిలెట్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు" అని తాయారా అనే మహిళ తన గోడు వెళ్లబోసుకుంది. వంట సామాగ్రి లేక, కనీసం వండుకోవడానికి కూడా అవకాశం లేక కేవలం బిస్కెట్లు, బన్నులతోనే కడుపు నింపుకుంటున్నామని మరికొందరు వాపోయారు. యమునా బజార్, బదర్‌పూర్ ప్రాంతాల్లో ఇళ్లు, దుకాణాలు నది మధ్యలో ఉన్నట్లు కనిపిస్తున్నాయి. బదర్‌పూర్‌లో ఇళ్ల పైకప్పులు మాత్రమే నీటిపై కనిపిస్తున్నాయి. "ఏళ్ల తరబడి కష్టపడి నా భార్యాబిడ్డల కోసం ఈ ఇల్లు కట్టుకున్నాను. ఇప్పుడు అదంతా నీటిపాలైంది. మేం ఎక్కడికి వెళ్లాలి?" అని తన సామానును తలపై పెట్టుకుని నీటిలో నిలబడిన అసీఫ్ కన్నీటిపర్యంతమయ్యారు. కొందరు ఇంకా ఇళ్లలోనే చిక్కుకుపోయి ఉంటారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వరద తగ్గిన తర్వాత తమ జీవితాలను తిరిగి ఎలా నిర్మించుకోవాలో తెలియక బాధితులు నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

# భారత్ సుంకాలు విధిస్తూ చంపేస్తోంది

## - ట్రంప్ ఘాటు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తమపై పలు దేశాలు సుంకాలు విధిస్తూ చంపేస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. "చైనా సుంకాలతో చంపేస్తోంది. భారతదేశం కూడా టారిఫ్ లతో మమ్మల్ని చంపుతోంది. బ్రెజిల్ కూడా భారీగా సుంకాలు విధిస్తోంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. స్కాట్ జెన్నింగ్స్ రేడియో షో ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, టారిఫ్‌ల గురించి తనకు తెలిసినంతగా మరే దేశానికి అర్థం కాదని అన్నారు. భారత్‌పై 50 శాతం టారిఫ్ విధించడాన్ని ఆయన సమర్థించుకున్నారు. తమ దేశ వస్తువులపై ఆయా దేశాలు అత్యధిక టారిఫ్ విధిస్తున్నాయని ఆయన ఆరోపించారు. తమ వస్తువులపై సుంకాలు ఉండవని ఢిల్లీ అంగీకరించిందని ఆయన అన్నారు. తాను తీసుకున్న చర్యలతో ఆయా దేశాలు టారిఫ్‌లపై దిగి వస్తున్నాయని తెలిపారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశం భారత్ అని ఆయన ఆరోపించారు. తాను చర్యలు తీసుకోకపోతే వారు దిగి వచ్చేవారు కాదని అన్నారు. అందుకే సుంకాలు ఉండాలని, తద్వారా ఆర్థికంగా బలపడతామని ఆయన వ్యాఖ్యానించారు. వివిధ దేశాలపై విధిస్తున్న టారిఫ్‌లు అక్రమమని ఓ ఫెడరల్ అప్పీల్ న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలపై కూడా ట్రంప్ స్పందించారు. ఈ కేసును ఇతర దేశాలు స్పాన్సర్ చేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

# హైదరాబాద్ గణేశ్ నిమజ్జనానికి హాజరుకానున్న అమిత్ షా

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భాగ్యనగరంలో అత్యంత వైభవంగా జరిగే గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెప్టెంబర్ 6న జరిగే ఈ మహా నిమజ్జన కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని వీహెచ్‌పీ తెలంగాణ విభాగం ప్రకటించింది. ఈ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు నగరవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. సెప్టెంబర్ 6న మధ్యాహ్నం 1.10 గంటలకి ప్రత్యేక విమానంలో అమిత్ షా బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఐటీసీ కాకతీయ హోటల్‌కు చేరుకుని భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు బీజేపీ ముఖ్య నేతలతో సమావేశమవుతారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల సమాయత్తంపై ఆరా తీయనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు భాగ్యనగర్ ఉత్సవ సమితి 46 ఏళ్ల ప్రయాణంపై ఐటీసీ కాకతీయలో ఏర్పాటు చేసే ఫొటో ఎగ్జిబిషన్‌ను అమిత్ షా ప్రారంభిస్తారు. కమిటీ సభ్యులతో గ్రూప్ ఫొటో దిగుతారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎస్ఎస్‌బీ 28వ బెటాలియన్ హెడ్ క్వార్టర్స్‌కి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. ఐటీసీ కాకతీయ నుంచి సాయంత్రం నాలుగు గంటలకు మొజంజాహీ మార్కెట్ వినాయక చౌక్‌కు చేరుకుంటారు. అక్కడ గణనాథులకు స్వాగతం పలకడంతో పాటు గణేశ్ శోభాయాత్రను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

# కాళేశ్వరం నివేదికపై స్టేకు హైకోర్టు నిరాకరణ

దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా నివేదికపై తక్షణమే స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటిపారుదల శాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన ఎస్కే జోషి, ఘోష్ కమిషన్ నివేదిక తన హక్కులకు భంగం కలిగించేలా ఉందని ఆరోపిస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలని ఆయన కోరగా, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా "అసలు కమిషన్ నివేదిక మీకు ఎలా చేరింది?" అని న్యాయస్థానం పిటిషనర్‌ను ప్రశ్నించింది. వాదనలు విన్న అనంతరం, నివేదికపై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన ధర్మాసనం, ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్కే జోషిని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే బుధవారానికి వాయిదా వేసింది.

## - పిటిషన్‌లో జోషి వాదనలు ఇవే..

విచారణ కమిషన్ తనను కేవలం సాక్షిగా మాత్రమే విచారణకు పిలిచిందని, కానీ తుది నివేదికలో తనపై ఆరోపణలు చేసిందని ఎస్కే జోషి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆరోపణలు చేసే ముందు తనకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదని, క్రాస్ ఎగ్జామిన్ చేసే అవకాశం కూడా కల్పించకుండా నివేదిక రూపొందించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఈ నివేదిక ఆధారంగా తనపై తదుపరి చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. జులై 31న కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలను ప్రభుత్వం మీడియా సమావేశంలో వెల్లడించిందని, ఇది తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# స్థానిక సంస్థల బలోపేతంపై ప్రభుత్వానికి కీలక సిఫార్సులు

స్థానిక సంస్థల పనితీరును మెరుగుపరిచేందుకు, వాటికి ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తమ నివేదికలో పలు సూచనలు చేసినట్లు వారు ముఖ్యమంత్రికి వివరించారు. కేవలం ఆర్థికపరమైన అంశాలే కాకుండా, పాలనాపరమైన, ఇతర ఆర్థికేతర అంశాలపైనా లోతైన సిఫార్సులు చేసినట్లు తెలిపారు.

గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఆర్థిక సంఘం ఈ సిఫార్సులను రూపొందించింది. ఈ సమావేశంలో ఆర్థిక, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. స్థానిక సంస్థల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, ఆర్థిక సంఘం నివేదికకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సిఫార్సులపై ప్రభుత్వం అధ్యయనం చేసి తదుపరి కార్యాచరణను ప్రకటించనుంది.

# పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా

అయిపోతుందా? అని ప్రశ్నించారు.తన మీద కుట్రలు జరుగుతున్నాయని పార్టీ ఆఫీసులో కూర్చొని మాట్లాడితే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనకు ఫోన్ చేసి మాట్లాడారా.? అని ప్రశ్నించారు. కుటుంబం విషయంల పక్కన పెడితే పార్టీలో ఒక ఎమ్మెల్సీ సమస్య గురించి చెబితే పట్టించుకోరా? అని అడిగారు. ఇప్పటికే తాను ఆ మాటలు మాట్లాడి 103 రోజులు అయిపోయిందని తెలిపారు. కేసీఆర్ వద్ద నుంచి కమ్యూనికేషన్ రావాలని తాను ఆశించలేదని, వర్కింగ్ ప్రెసిడెంట్ నుంచి ఫోన్ రాకపోవడం ఆశ్చర్యం కలిగించిందని తెలిపారు.కేసీఆర్, కేటీఆర్, తనది రక్త సంబంధం అని పదవులు పోతేనో, పార్టీలో నుంచి సస్పెండ్ చేస్తేనో పోయే బంధం కాదని అన్నారు. అయితే పార్టీలో ఉండి డబ్బు సంపాదించుకోవాలని, వ్యక్తిగత లబ్ధి పొందాలని చూస్తున్నవారు, తమ కుటుంబం బాగుండకూడదని, తాము ముగ్గురం కలిసి ఉండొద్దని, తమ కుటుంబం విచ్ఛిన్నం కావాలని చూస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. అందులో మొదటి స్టెప్‌గా పార్టీలో నుంచి తనను బయటకు పంపించారని చెప్పుకొచ్చారు. ఇది ఇక్కడితో ఆగిపోదని, కేసీఆర్ ఆయన చుట్టూ ఏం జరుగుతుందో చూసుకోవాలని అభ్యర్థిస్తున్నానని పేర్కొన్నారు. రేపటిరోజున ఇదే ప్రమాదం రామన్న (కేటీఆర్)కు, తన తండ్రి కేసీఆర్‌కు పొంచి ఉందని చెప్పుకొచ్చారు.బీఆర్ఎస్ పార్టీని వారు హస్తగతం చేసుకునేందుకు చూస్తున్నారని హరీష్ రావు, సంతోష్ కుమార్ టార్గెట్‌గా తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, హరీష్ రావులు కలిసి ఒకే ఫ్లైట్‌లో ప్రయాణం చేసిన సమయంలో రేవంత్ రెడ్డి కాళ్లు పట్టుకుని హరీష్ రావు సరెండర్ అయిన తర్వాత తనపై కుట్రలు ప్రారంభమయ్యాయని ఆరోపించారు. అప్పటినుంచే తమ కుటుంబాన్ని విడగొట్టాలనే ప్రయత్నాలు మొదలయ్యాయని అన్నారు. రేవంత్ రెడ్డి, హరీష్ రావులు ఒకే ఫ్లైట్‌లో ప్రయాణించారా? లేదా? అనేది వారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.హరీష్ రావుకు చెందిన డెయిరీలో అక్రమాలు జరుగుతున్నాయని ప్రచారం తెరమీదకు తీసుకువస్తారని, కానీ చర్యలు తీసుకోరని కవిత ఆరోపించారు. పాల వ్యాపారంలో అవినీతి జరిగిందని ముఖ్యమంత్రి పీఆర్‌వో ట్వీట్ చేస్తారు, తర్వాత పేపర్‌లలో వార్తలు వస్తాయి కానీ మూడు రోజులకు ఆ విషయం మాయం అయిపోతుంది, అదే కేటీఆర్‌ను అయితే విచారణ పేరుతో పిలిచి వేధింపులకు గురిచేస్తారు. రేవంత్ రెడ్డితో నిఖార్సుగా కొట్లాడుతున్నాం కాబట్టే మా మీద కేసులు పెడతారు, వాళ్లది (హరీష్ రావు) మాత్రం మూడు రోజులకే గయబ్ అయిపోతుంది" అని కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఇలాంటివి ఎన్నో ఆరోపణలు వచ్చాయి కానీ అవన్నీ మాయమైపోయాయని హరీష్ రావు మీద ఎలాంటి కేసులు, విచారణలు లేవని విమర్శించారు.

# ఉగ్రవాదంపై భారత్ పోరుకు జర్మనీ మద్దతు

బుధవారం న్యూఢిల్లీలో జరిగిన సమావేశం అనంతరం విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ విషయాలను మీడియాకు వెల్లడించారు. జర్మనీ మంత్రి వాడెఫుల్ స్వయంగా భారత్ ఆత్మరక్షణ హక్కు గురించి స్పష్టంగా మాట్లాడారని జైశంకర్ తెలిపారు. గత ఏప్రిల్‌లో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ఆయన గుర్తుచేశారు. ఈ ఆపరేషన్ అనంతరం జూన్‌లో జర్మనీలో పర్యటించిన భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి ఘనస్వాగతం లభించిందని చెప్పారు. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని జర్మనీ అర్థం చేసుకోవడాన్ని తాము ఎంతగానో గౌరవిస్తామని జైశంకర్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రతా సహకారం కూడా గణనీయంగా పెరిగిందని జైశంకర్ అన్నారు.

గతేడాది జరిగిన 'తరంగ్ శక్తి' వైమానిక విన్యాసాల్లో జర్మనీ పాల్గొనడాన్ని, వారి నౌకలు గోవాకు రావడాన్ని ప్రస్తావించారు. భవిష్యత్తులో ఇలాంటి భాగస్వామ్యాన్ని మరింత విస్తరించాలని ఇరువురం అంగీకరించినట్లు తెలిపారు. గతంలో రక్షణ రంగంలో ఎదురైన ఎగుమతి నియంత్రణ సమస్యలు ప్రస్తుతం పరిష్కారమయ్యాయని, అనుమతులు వేగంగా వస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాల్లోని పలు అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు జైశంకర్ వివరించారు. రాజకీయ, ఆర్థిక సహకారంతో పాటు పరిశోధన, భవిష్యత్ టెక్నాలజీలు, డిజిటల్, సెమీకండక్టర్లు, విద్య, ఇంధనం వంటి రంగాల్లో కలిసి పనిచేయడంపై చర్చలు జరిగాయి. భారత్–యూరోపియన్ యూనియన్ (ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) త్వరగా పూర్తయ్యేలా జర్మనీ చూపుతున్న చొరవను ఆయన అభినందించారు. అంతర్జాతీయంగా ఉక్రెయిన్ సంక్షోభం, పశ్చిమాసియా, ఇండో–పసిఫిక్ ప్రాంతాల్లోని పరిస్థితులపై కూడా ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు.

# కనీసం ఒక యూరియా బస్తా అందించలేరా.?

చలనం లేకపోవడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో ఎరువుల బ్లాక్ మార్కెట్ నడుస్తోందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రూ. 267లకే దొరకాల్సిన యూరియా బస్తాను ప్రైవేటు వ్యాపారులు అక్రమంగా నిల్వ చేసి, రూ. 200లు అదనంగా వసూలు చేస్తూ అమ్ముకుంటున్నారని తెలిపారు. అక్రమ నిల్వలపై ఎలాంటి తనిఖీలు లేవని, బాధ్యులపై చర్యలు శూన్యమని విమర్శించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు భరోసా కేంద్రాలకు సరైన కేటాయింపులు జరపకపోవడమే ఈ సంక్షోభానికి కారణమని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో రైతులకే నేరుగా ఆర్‌బీకేల ద్వారా 12 లక్షల టన్నుల ఎరువులను సరఫరా చేశామని జగన్ గుర్తుచేశారు. మార్కెట్ ధర కంటే రూ. 50 తక్కువకే రైతులకు అందించామని, ప్రస్తుత ప్రభుత్వం ఆ పనిని ఎందుకు చేయలేకపోతోందని ఆయన సూటిగా ప్రశ్నించారు.

# బుద్ధిలేదా.. ప్రతిపక్షహోదా ఇవ్వాల్సింది ప్రజలు

తమ ఓటు ద్వారా నిర్ణయిస్తారు. వైసీపీకి ప్రజలు కేవలం 11 సీట్లు ఇచ్చారు. జనసేనకు 21 సీట్లు లభించాయి. ఒక్క సీటు ఎక్కువ వచ్చినా వైసీపీకి హోదా గురించి మాట్లాడే హక్కు ఉండేది," అని అన్నారు.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా సాధారణంగా రెండో అతిపెద్ద పార్టీకి ఇస్తారు. కనీసం 10% సీట్లు ఉండాలనే నిబంధన వైసీపీకి అడ్డంకిగా మారింది. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 164 సీట్లతో అధికారంలో ఉంది. జనసేన 21 సీట్లతో రెండో స్థానంలో ఉంది. వైసీపీ ఈ హోదా కోసం కోర్టుకు వెళ్లింది. స్పీకర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ చంద్రబాబు నాయుడు ప్రజాతీర్పును గౌరవించాలని, రాజ్యాంగ నిబంధనలను అనుసరించాలని సూచించారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామని చెప్పి వైసీపీ సభ్యులెవరూ రావడం లేదు. ప్రజా సమస్యల కోసం అసెంబ్లీని వాకౌట్ చేసిన వారిని చూశాం కానీ ఇలా తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వలేదని మొత్తంగా తన పార్టీ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా చేస్తున్నరాని జగన్ పై పలువురు విమర్శలు చేస్తున్నారు. గతంలో అసెంబ్లీలో చంద్రబాబును నలుగురు ఎమ్మెల్యేలను లాగేస్తే ప్రతిపక్ష నేత హోదా పోతుందని జగన్ హెచ్చరించారు. అవే మాటలను టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడెలా ప్రతిపక్ష నేత హోదా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.

# చెత్తగాళ్ల వెనుక నేనెందుకుంటా

కొందరు మాట్లాడుతున్నారు అంత చెత్తగాళ్ళ వెనక నేనెందుకు ఉంటానని ప్రశ్నించారు. నేను నాయకుడిని, ఉంటే ముందుంటా నా వాళ్లకు తోడుగా ఉంటానని ప్రకటించారు. వాళ్ళ కుటుంబంలో వాళ్లు వాళ్లు కత్తులతో పొడుచుకుని హరీష్, సంతోష్ వెనక రేవంత్ రెడ్డి ఉన్నారని ఒకరంటే లేదు లేదు కవిత వెనకాల రేవంత్ రెడ్డి ఉన్నారని ఇంకొకరంటున్నారని విమర్శలు గుప్పించారు.

## - నన్ను ఇన్వాల్వ్ చేయవద్దు.. నాకు టైం లేదు

మీరంతా దిక్కుమాలినవారని తెలంగాణ ప్రజలు బండకేసి కొట్టారని అన్నం తినేవారు ఎవరైనా మీ వెనక ఉంటారా అని ప్రశ్నించారు. దయచేసి మీ కుటుంబ పంచాయతీలోకో, మీ కుల పంచాయతీలోకో మమ్మల్ని లాగవద్దని హెచ్చరించారు. మాకు ఎలాంటి ఆసక్తి లేదని స్పష్టం చేశారు. మిమ్మల్ని ఎప్పుడో ప్రజలు తిరస్కరించారన్నారు. మీది కాలం చెల్లిన నోటు లాంటిది ఆ పార్టీ అని కాలగర్భంలో కలిసిపోతుందని స్పష్టం చేశారు. ప్రకృతి ఉంటుంది, ప్రకృతి శిక్షిస్తుందని స్పష్టం చేశారు.

## - రెండు వర్గాలూ రేవంత్ పైనే ఆరోపణలు

బీఆర్ఎస్ పార్టీలో ఏర్పడిన పరిణామాలకు రేవంత్ రెడ్డే కారణం అన్నట్లుగా కవిత చెబుతున్నారు. హరీష్ రావు, రేవంత్ రెడ్డి ఒకే విమానంలో ప్రయాణించారని ఆ తర్వాతే తనపై కుట్రలు ప్రారంభమయ్యాయని ఆరోపిస్తున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు కవిత వెనుక రేవంత్ రెడ్డి ఉన్నారని అంటున్నారు. రేవంత్ రెడ్డి తో కలిసి బీఆర్ఎస్ పై కవిత కుట్రలు చేస్తున్నారని అనుమానించేవారు ఎక్కువగా ఉన్నారు.

అయితే రెండు వర్గాలు మీ వెనుక రేవంత్ ఉన్నారంటే రేవంత్ ఉన్నారని అంటున్నారు. కానీ రేవంత్ మాత్రం తాను వెనుక ఉండనని తన వాళ్ల కోసం ముందే ఉంటానని, మీ చెత్త పంచాయతీలోకి తనను లాగవద్దని నేరుగానే కౌంటర్ ఇచ్చారు.

# బాణం కేటీఆర్ మీద నుంచి హరీష్ వైపు తిప్పారు

పదేళ్లపాటు యథేచ్ఛగా దోపిడీ జరిగిందని అన్నారు. ఆస్తుల పంపకాల్లో విభేదాలు రావడంతోనే వారు ఇప్పుడు బయటపడుతున్నారని కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అనేది లేకుండా చేయాలని ఎవరూ ప్రయత్నించడం లేదని, వారికి వారే చేసుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు అవినీతి సొమ్మును పంచుకుని ఇప్పుడు ఒకరినొకరు నిందించుకుంటున్నారని ఆయన అన్నారు.

# కాళేశ్వరం అవినీతి నుండి దృష్టి మరల్చేందుకు కవిత అంశం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవిత రాజీనామా చేయడంపై కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ స్పందించారు. ఆమె బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినంత మాత్రాన ఒరిగేదేమీ లేదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి కవిత అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, గొర్రెల పంపిణీ, బర్రెల కొనుగోలు కుంభకోణాలపై సమగ్ర చర్చ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం అవినీతిపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ నివేదికలు వచ్చిన తరువాత కూడా ప్రభుత్వం కాలయాపన చేసిందని, ఇప్పుడు సీబీఐకి అప్పగిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం, ఫోన్ ట్యాపింగ్ కేసును ఎందుకు అప్పగించడం లేదని ఆయన ప్రశ్నించారు.

# షూస్, చెప్పులు, బట్టలు మరింత చౌకగా

అయితే తాజాగా జరిగిన ఈ సమావేశంలో కౌన్సిల్ ఈ పరిమితిని రూ.2,500 వరకు పెంచింది. అంటే ఇకపై రూ.2,500 లోపు ధర ఉన్న షూస్, బట్టలు 5శాతం జీఎస్టీ శ్రేణిలోకి వస్తాయని చెప్పవచ్చు. దీని వలన ఈ ఉత్పత్తులు వినియోగదారులకు మరింత చౌకగా లభించనున్నాయని చెప్పుకోవచ్చు. ఈ నిర్ణయం వస్త్ర, పాదరక్షల పరిశ్రమలకు కూడా ప్రోత్సాహం కలిగిస్తుంది. దీంతోపాటు జీఎస్టీ కౌన్సిల్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. 12శాతం, 28శాతం పన్ను స్లాబ్‌లు పూర్తిగా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ వర్గంలో ఉన్న ఎక్కువ ఉత్పత్తులు 5శాతం లేదా 18శాతం శ్రేణిలోకి మార్చారు. దీని వలన పన్ను నిర్మాణం సులభతరం అవుతుందని చెప్పుకోవచ్చు. సాధారణంగా వినియోగదారులకు ధరల పరంగా ఉపశమనం లభించగా, పరిశ్రమలకు కూడా ఈ నిర్ణయం ఊరట కలిగించిందని చెప్పవచ్చు. జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలు చిన్న, మధ్య తరహా వ్యాపారాలను దృష్టిలో ఉంచుకుని పలు సంస్కరణలు ఆమోదించింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మూడు రోజుల్లో పూర్తి చేసే అవకాశం ఇచ్చింది. దీంతో పాటు ముందే నింపిన రిటర్నులు అమలు అవుతాయి. వస్త్రాలు, రసాయనాలు, ఎరువులు, ఫార్మా రంగాలకు ఏడు రోజుల్లో రీఫండ్ ఇవ్వాలని కౌన్సిల్లో నిర్ణయించారు. అయితే ఈ మార్పులు వ్యాపారాలకు సమయం, ఖర్చు ఆదా చేస్తాయని చెప్పవచ్చు. అయితే రాష్ట్రాలు మాత్రం ఈ మార్పులతో తమ ఆదాయం తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశాయి. జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ, కొత్త పన్ను నిర్మాణం వల్ల తమ రాష్ట్ర ఆదాయం 10%–%12శాతం వరకు పడిపోయే అవకాశం ఉందని చెప్పారు. ఉగ్రవాద దాడుల కారణంగా ఇప్పటికే ఆదాయ లోటు ఎదుర్కొంటున్న జమ్మూ కాశ్మీర్‌కు ఇది మరింత భారమవుతుందని పేర్కొన్నారు.

# టార్గెట్ జాగృతి

## - బీఆర్ఎస్‌లో చేరిన జాగృతి శ్రేణులు

**హైదరాబాద్** 300 మంది ఖమ్మం జాగృతి నాయకులు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకొనున్నారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్లో కేసీఆర్ని కలవడానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా జాగృతి నాయకులు, కార్యకర్తలు వచ్చారు. నాలుగు బస్సులలో సుమారు 300 మంది వచ్చారు.

# అమిర్ కరాటే అకాడమీ విద్యార్థులకు బంగారు పథకాలు

## - సౌత్ ఇండియా ఛాంపియన్షిప్ లో కనబరిచిన ప్రతిభ

## - 1 గోల్డ్ 2 సిల్వర్ 5 కాంస్య పథకాలు




**మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లాకు చెందిన కరాటే ఇండియా ఆర్గనైజేషన్ డిస్టిక్ సెక్రటరీ అమిర్ పాషా విద్యార్థులుబెంగళూరులో జరిగిన సౌత్ ఇండియా జోనల్ కరాటే ఛాంపియన్ షిప్ ఆగస్ట్ (30, 31) 2025 లో జరిగిన కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో మొదటి స్థానం గెలుపొందిన మోహమ్మద్ సానియా వయసు 8 స. (కూమిటే –25 కేజీలు) విభాగంలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం(2 వ) మిడిదొడ్డి సంతోష్ కుమార్ 12 స.(కూమిటే బి40 కేజీలు) వెండి పతకం (3వ) కొనేటి థమన్ 11స. (కూమిటే –40 కేజీలు) వెండి పథకం (4వ) బండి హర్షిత్ రాజ్ 13 స. కటా విభాగంలో కాంస్య పతకం (5వ) బనోత్ వర్షిత్ 8 స. కటా విభాగంలో కాంస్య పతకం (6వ) అబ్బర బోయిన రోహిత్ 6స . కటా విభాగంలో కాంస్య పతకం (7) గోలుసుల దేవ్వంశ్ సాయి10 స .(కూమిటే –25 కేజీలు) కాంస్య పథకం (8వ) సమ్మెట ఆరుష్ 8స . (కూమిటే +35 కేజీలు) కాంస్య పతకం గెలుపొందడం జరిగింది. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా క్రీడా అధికారి (డిస్టిక్ యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్) ఓలేటి జ్యోతి విజేతలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం కరాటే ఇండియా ఆర్గనైజేషన్ డిస్టిక్ సెక్రటరీ అమిర్ పాషా మాట్లాడుతూ నా విద్యార్థులు క్రీడలు ఆడి 8 మంది 8 పథకాలు సాధించి మహబూబాబాద్ జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకు రావడంలో వారి కృషి అభినందనీయం అని తెలుపుతూ, భవిష్యత్తులో నా విద్యార్థులను నేషనల్ స్థాయి క్రీడలలో ఎక్కువ మంది విజయాలు సాధించే దిశగా వారికి దృఢమైన శిక్షణ అందించి వారి ఎదుగుదలకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం పథకాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు వారి విజయాల పట్ల కోచ్ వారికి అందిస్తున్న ప్రత్యేకమైన శిక్షణ పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు కిట్స్ అందజేత

**రామడుగు:** రామడుగు మండల కేంద్రంలోని ఉప తపాల కార్యాలయం వద్ద విశ్వకర్మ యోజన కింద విశ్వబ్రాహ్మణుల లబ్ధిదారులకు బుధవారం కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి మండల శాఖ మాజీ అధ్యక్షులు ఒంటెల కర్ణాకర్ రెడ్డి హాజరై లబ్ధిదారుల కిట్స్ ని పరిశీలించారు. అనంతరం ఒంటెల కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 18 కులాల పేదల కోసం ఉపయోగపడే ఈ పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని బిజెపి మండల శాఖ మాజీ అధ్యక్షుడు ఒంటెల కర్ణాకర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ కట్ట రవీంద్ర చారి బిజెపి మండల నాయకులు మునిగంటి శ్రీనివాస్ చారి బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎడవెల్లి రామ్ బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఐటీ సెల్ మండల కన్వీనర్ మాడిశెట్టి జయంత్ ఓబిసి మోర్చా మండల అధ్యక్షుడు బొమ్మ కంటి భాస్కరాచారి ఓబిసి మోర్చా మండల జనరల్ సెక్రెటరీ వడ్లూరి రాజేంద్ర చారి బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ బిజెపి మాజీ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ బిజెపి మండల శాఖ మాజీ అధ్యక్షుడు జిట్ట వేణి అంజిబాబు బిజెపి మాజీ మండల కార్యదర్శి మ్యాదారం సత్యనారాయణ చారి రుద్రారం బూత్ సోషల్ మీడియా కోటగిరి రవీంద్ర చారి బిజెపి మాజీ మండల ప్రధాన కార్యదర్శి అక్కేపల్లి తిరుపతి చారి వెంకటేష్ మైపాల్ రెడ్డి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గణేశుని నిమజ్జనం కు 30,000 మంది పోలీసు లతో భారీ బందోబస్తు:సీవీ ఆనంద్



హైదరాబాద్(ప్రశ్న న్యూస్)గణేష్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించడానికి తుది ఏర్పాట్లలో భాగంగా, పోలీస్ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖలతో కలిసి ఒక ఉమ్మడిగా ఏర్పడి ఊరేగింపు మార్గమును తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీలో హైదరాబాద్



కమిషనర్ సి.వి. ఆనంద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి, అదనపు సిపి విక్రమ్ సింగ్ మాన్, రాచకొండ సిపి సుధీర్ బాబు, హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్, ట్రాఫిక్ జాయింట్ సీపీ డి. జోయల్ డెవిస్, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాల జోనల్ డీసీపీలు, హైదరాబాద్ నగర పోలీసుల ఇతర విభాగాల అధికారులు, హెచ్ఎండీఏ, ఆర్అండ్బీ, ట్రాన్స్కో, హెచ్ఎండబ్ల్యూఎస్అండ్ఎస్బీ నుండి సీనియర్ అధికారులు పాల్గొన్నారు.ఊరేగింపు మార్గమును బాలాపూర్ గణేష్ మండపము నుండి ప్రారంభమై, మొత్తం 19 కి.మీ. పొడవున ఉన్న మార్గంలో చంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, చార్మినార్, ఎం.జే. మార్కెట్ మరియు తెలుగు తల్లి ఫ్లైఓవర్ వరకు తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా సి.వి. ఆనంద్, డిజి, కమిషనర్ ఆఫ్ పోలీస్, హైదరాబాద్ మాట్లాడుతూ గణేష్ విగ్రహాల ఊరేగింపు మార్గ మధ్యంలో ఏవైనా సమస్యలు ఉంటే అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో సరిచేసుకోవాలని అందరిని కోరారు. గణేశ్ ఉత్సవాల గురించి గత నెలరోజులుగా అన్ని శాఖల సమన్వయముతో పనిచేస్తూ ముందుకు వెళ్ళుతున్నాము అని తెలిపారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు మార్గంలో అధికారుల బృందం రాజేష్ మెడికల్ హాల్, గుల్జార్ హౌస్, ఎం.జే. మార్కెట్ జంక్షన్, తెలుగు తల్లి జంక్షన్ వద్ద ఆగి నిశితంగా పరిశీలించారు. ప్రతి జోన్ అధికారులు తమ పరిధిలోని విగ్రహాలను సకాలంలో నిమజ్జనానికి బయలుదేరే విధంగా చూడాలని తెలిపారు. ప్రస్తుతము వర్షాలు పడుతున్నందున, ఈ మధ్య కొందరు విద్యుత్తు షాక్ గురి అయి కొంత మంది చనిపోయినందున వలన మండప నిర్వాహకులకు అందరికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు జారీచేసినాము అని తెలిపారు. కేంద్ర బలగాలు కూడా వచ్చినాయి వారితో హైదరాబాదు నగరములో మార్చ్ ఫాస్ట్ కూడా నిర్వహిస్తున్నాము అని తెలిపారు. గత అనుభమును బట్టి చూస్తే విగ్రహాల నిమజ్జనానికి కనీసము 40 గంటల సమయము పడుతుంది. కావున మండప నిర్వాహకులు ముందుగా బయలు దేరినచో నిమజ్జనానికి తక్కువ సమయము పట్టే అవకాశము ఉంటుందని తెలిపారు. ఊరేగింపు మార్గమధ్యలో ఎత్తుకు సంబంధించిన పరిమితులు, జంక్షన్‌ల వద్ద క్లియరెన్స్‌లను కూడా పరిశీలించారు. గణేష్ ఉత్సవం కోసం హైదరాబాద్ నగర పోలీసులు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన సిబ్బందితో కలిపి దాదాపు 30,000 మంది పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నామని తెలిపారు.పోలీసు సిబ్బందికి కావలసిన వసతి ఆహార ఏర్పాట్లు కూడా చేశామన్నారు. గణేశ్ విగ్రహాల ఊరేగింపు మార్గంలో వివిధ రోడ్లను మూసివేయడం లేదా దారి మళ్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు మార్గంలో క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, డాగ్ స్క్వాడ్‌లు, యాంటీ-చైన్ స్నాచింగ్ బృందాలు, షీ టీమ్‌లను కూడా మోహరించనున్నామని తెలిపారు. నిమజ్జనము రోజున జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ట్రాన్స్కో, ఆర్అండ్బీ, వాటర్ వర్క్స్, ఆర్టీఏ, వైద్య, ఆరోగ్య శాఖ వంటి విభాగాల సీనియర్ అధికారులు ఉమ్మడి కమాండ్ కంట్రోల్ సెంటర్ టీజీఐసీసీసీలో అందుబాటులో ఉంటారని తెలిపారు. మిలాద్ ఉన్ నబీ పండుగ కూడా 6వ తేదీన ఉన్నది,అదే రోజున నిర్వహించాల్సిన ఊరేగింపును మత పెద్దలు ఎంతో పెద్దమనసుతో వారి ఊరేగింపును 14వ తేదికి మార్చుకున్నారని తెలిపారు.
ఈ సంవత్సరం గణేష్ విగ్రహాల ఊరేగింపు నిమజ్జనం సందర్భంగా ఎలాంటి చిన్న సంఘటన కూడా జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ప్రజలు, భక్తులు ఊరేగింపు, నిమజ్జనం సమయంలో పోలీసు వారితో సహకరించాలని కోరారు.

## మద్యం టెండర్లో గౌడులకు 25 శాతం వాటా కల్పించాలి



**నర్సంపేట** కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం మద్యం టెండర్లలో గౌడ కులస్తులకు 25 శాతం వాటా కల్పించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ డిమాండ్ చేశారు.పట్టణంలో బుదవారం మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం గౌడ కులస్తులకు మద్యం దుఖాణాలలో 15 శాతంకెటాయించడం జరిగిందన్నారు.కామారెడ్డి లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మేనిపెస్టోలో గౌడ కులస్తులకు మద్యం దుఃఖణాల కేటాయింపులో 25 శాతం ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు.కామారెడ్డి డిక్లరేషన్ లో గౌడ్స్ కు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలన్నారు.కామారెడ్డి లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారంగా 25 శాతం వాటా డిక్లరేషన్ విస్మరించడం సరికాదన్నారు.
మద్యం టెండర్లలో 3 లక్షలు కాకుండా 2 లక్షలు కుదించాలని,బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలన్నారు. రెండేళ్లుగా తాటి చెట్ల పైనుంచి పడి చనిపోయిన, గాయపడిన 7 వందల మంది గీత కార్మికులకు పెండింగ్ లో 7 కోట్ల రూపాయల ఎక్స్ గ్రేషియా వెంటనే చెల్లించాలని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని,50 సంహాత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికుడికి పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.మోకుదెబ్బ జిల్లా ప్రచార కార్యదర్శిగా శ్యామ్ సుందర్ గౌడ్ నియామకం.....దుగ్గొండి మండలం లక్ష్మిపురం గ్రామానికి చెందిన బొమ్మగాని శ్యామ్ సుందర్ గౌడ్ ను మోకుదెబ్బ హన్మకొండ జిల్లా ప్రచార కార్యదర్శిగా నియమించినట్లు మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ తెలిపారు.గత రెండేళ్లుగా శ్యామ్ కుమార్ గౌడ్ గౌడ కులస్తులకు చేస్తున్న సేవలను గుర్తించి ఈ పదవిలో నియమించిన ట్లు రమేష్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ రాష్ట్ర కార్యదర్శి మద్దెల సాంబయ్య గౌడ్, హన్మకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు తోటకూరి రాందాస్ గౌడ్, గోపగాని వెంకట్ గౌడ్, జిల్లా సలహాదారులు రామగోని సుధాకర్ గౌడ్,జిల్లా కార్యదర్శి బోడిగె మల్లేశంగౌడ్, మేరుగు మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ అరెస్ట్ అంటూ కాంగ్రెస్ సొల్లు పురాణం

## -ఈనెల నుండి ప్రజల్లోకి వెళ్తామన్న కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మల్లన్నసాగర్, కొండపొచమ్మ సాగర్ లతో రాబోయే 50 ఏండ్ల హైదరాబాద్ తాగునీటి అవసరాలను తీర్చిన దార్శనికుడు కేసీఆర్‌పై సీబీఐ విచారణ జరపడం సిగ్గుచేటు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీబీఐని మోడీ జేబు సంస్థ అని రాహుల్ గాంధీ విమర్శిస్తే రేవంత్ దాన్ని ప్రశంసించడం కాంగ్రెస్ దౌర్భాగ్యస్థితికి నిదర్శనం అని విమర్శలు గుప్పించారు. పినపాక నియోజకవర్గం, మణుగూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రభాకర్ రావు, ఆయన అనుచరులు ఇవాళ ఎర్రవల్లిలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన కేటీఆర్, భారతదేశ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు కూడా పదేళ్లలో కేసిఆర్ చేసినంత అభివృద్ధి చేయలేదన్నారు. కాళేశ్వరంతో తెలంగాణ పచ్చబడుతుంటే కొంతమంది కళ్లు ఎర్రబడుతున్నాయన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు అనుక్షణం గుర్తు తెచ్చుకుంటుంటే ఓర్వలేకనే కాంగ్రెస్, బీజేపీలు కక్షపూరితంగా అక్రమ కేసులతో కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.

### - యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది

రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో ఆగమాగమైందని ప్రజలంతా కేసీఆర్ పాలననే తిరిగి కోరుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. కేవలం 21 నెలల కాంగ్రెస్ పాలనలోనే ప్రజలు విసిగిపోయారని కేసీఆర్ ఉన్నప్పుడే బాగుంది అని ప్రతి ఒక్కరూ అంటున్నారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని విరుచుకుపడ్డారు. ఎన్నికలకు ముందు హామీల జాతర, ఎన్నికల తర్వాత చెప్పుల జాతర అన్నట్టుగా రాష్ట్రంలో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోందని మండిపడ్డారు. వ్యవసాయ సొసైటీల ముందు రైతులు చెప్పుల వరుసలు పెట్టి పడిగాపులు కాయాల్సిన దుస్థితిని కాంగ్రెస్ కల్పించిందని మండిపడ్డారు. ఆనాటి దుర్భర రోజులను మళ్లీ తీసుకొస్తా అని చెప్పి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలను నిజాయితీగా మోసం చేశాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు.

### - సీఎం పీఠానికి ఉన్న గౌరవాన్ని మంటగలుపుతున్న రేవంత్ రెడ్డి

'2014లో వ్యవసాయ దిగుబడుల్లో 14వ స్థానంలో ఉన్న తెలంగాణను, కాళేశ్వరం, సీతారామ, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రాజెక్టులతో సస్యశ్యామలం చేసి దేశానికి అన్నం పెట్టే స్థాయికి తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. సముద్ర మట్టానికి 80 మీటర్ల ఎత్తున ఉన్న మేడిగడ్డ నుంచి 618 మీటర్ల ఎత్తున ఉన్న కొండపోచమ్మ సాగర్‌కు రోజుకు 2 టీఎంసీల నీటిని తరలించే అద్భుతమైన, ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం అని చెప్పుకొచ్చారు. ఈ ప్రాజెక్టుతో లక్షలాది ఎకరాలకు సాగునీరు, ఎన్నో గ్రామాలకు తాగునీరు అందుతుందని అన్నారు. రేవంత్ రెడ్డి తన మాటలతో, చేతలతో ముఖ్యమంత్రి పీఠానికి ఉన్న గౌరవాన్ని మంటగలుపుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణను క్యాన్సర్, ఎయిడ్స్ రోగితో పోల్చడం, ఢిల్లీకి పోతే తనను చెప్పులు ఎత్తుకుపోయేవాడిలా చూస్తున్నారని అనడం, పేగులు మెడలో వేసుకుంటా లాంటి మాటలు మాట్లాడటం ముఖ్యమంత్రి స్థాయికి తగునా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

### - కేసీఆర్ అరెస్ట్ అంటూ సొల్లు పురాణం

ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్, కేసీఆర్ వంటి ముఖ్యమంత్రులను చూసిన ప్రజలు, రేవంత్ రెడ్డిని చూసి సిగ్గుపడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దమ్మున్న నాయకుడు ఉంటే దమ్మిడీ లేకున్నా సంక్షేమ పథకాలు ఆగవన్న కేటీఆర్, కరోనా కష్టకాలంలో రాష్ట్ర ఆదాయం సున్నా అయినా రైతుబంధు, పెన్షన్లు, జీతాలను కేసీఆర్ ఆపలేదని చెప్పుకొచ్చారు. కానీ కాంగ్రెస్ సన్నాసులకు పనిచేయడం చేతకాక సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం కేవలం రూ. 2.80 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేసిందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అడిగిన ప్రశ్నకు కేంద్రమే స్పష్టంగా సమాధానం చెప్పినా సిగ్గులేకుండా కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హామీల అమలునుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రోజూ కేసీఆర్ అరెస్ట్, కేటీఆర్ అరెస్ట్ అంటూ సొల్లు పురాణం చెబుతున్నారన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు.

### - వారసత్వ ఉద్యోగాలు కల్పించాం

'సింగరేణి కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో చేసిందన్న కేటీఆర్, వారసత్వ ఉద్యోగాలు కల్పించడం నుంచి ఆరోగ్య సమస్యల వరకు అన్ని విధాలా అండగా నిలిచింది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. 'సింగరేణి కార్మికులకు ఇచ్చిన పది హామీల్లో ఎనిమిదింటిని పూర్తిగా, రెండింటిని పాక్షికంగా అమలు చేసిన ఘనత కేసీఆర్‌ది అని అన్నారు. అయినప్పటికీ సింగరేణి ప్రాంతంలోని 13 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయిందనే దానిపై లోతుగా అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీకి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంకు మధ్య సమన్వయం లోపించిందా? యూనియన్ అంతర్గత రాజకీయాలు పార్టీపై ప్రభావం చూపించాయా? అనే కోణంలో ఆనాడు చర్చించామని చెప్పారు. పార్టీ మద్దతు లేకున్నా, మణుగూరు డివిజన్‌లో కేవలం 24 ఓట్ల తేడాతోనే యూనియన్ నాయకులు ఓడిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

### - సెప్టెంబర్ 10న భద్రాచలంలో పర్యటిస్తా

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పదికి పది అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండా ఎగరవేయాలని కేటీఆర్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈ నెల 10, 11 తేదీల్లో తాను భద్రాచలం, కొత్తగూడెం పర్యటనకు వస్తున్నట్లు ప్రకటించారు. గాడిదను చూస్తేనే గుర్రం విలువ తెలుస్తుంది అన్నట్టు, రేవంత్ రెడ్డిని చూశాకే ప్రజలకు కేసీఆర్ విలువ తెలిసిందన్నారు. కాంగ్రెస్ మోసాలను, బీజేపీతో పొంచి ఉన్న ముప్పును ప్రజలకు వివరించాలన్నారు. చిన్న చిన్న మనస్పర్థలు పక్కనపెట్టి, అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టాలన్నా, ప్రజలు బాగుపడాలన్నా కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడమే శరణ్యం అన్నారు. ఇంకా మూడేళ్లు అధికార పార్టీలో ఉండే అవకాశం

# పర్యాటకంలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలి

- పర్యాటక రంగంపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష
- అరకు కాఫీ, ఎర్రచందనం, చేనేత ఉత్పత్తులతో ఏపీ టూరిజానికి ప్రత్యేక బ్రాండింగ్
- రాజమండ్రిని ప్రత్యేక పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేలా ప్రాజెక్టుల రూపకల్పన
- విజయవాడలో మైసూరు తరహాలో అత్యంత వైభవంగా దసరా ఉత్సవాల నిర్వహణ



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి సరికొత్త రూపునిచ్చి, ప్రపంచ పటంలో రాష్ట్రానికి ప్రత్యేక స్థానం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం భారీ ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా, అనంతపురంలో ప్రపంచ ప్రఖ్యాత 'డిస్నీ వరల్డ్ సిటీ' ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని, ఆ సంస్థ ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు రూపొందించాల్సిన కార్యాచరణపై బుధవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పర్యాటకులను ఆకర్షించేందుకు కేవలం కొత్త ప్రాజెక్టుల నిర్మాణం మాత్రమే కాకుండా, వారికి మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడంపై కూడా దృష్టి సారించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పర్యాటకుల బస కోసం గదుల కొరత లేకుండా చూడాలని, 2026 మార్చి నాటికి 10 వేల గదులు, 2029 నాటికి ఏకంగా 50 వేల గదులు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. ఈ లక్ష్య సాధన కోసం రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణానికి అనువైన స్థలాలను వెంటనే గుర్తించాలని సూచించారు. ముఖ్యంగా తిరుపతి సహా ఇతర ప్రసిద్ధ ఆలయ నగరాల్లో 'హోమ్ స్టే' విధానాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించాలని తెలిపారు. కోనసీమ సహజ సౌందర్యాన్ని, గ్రామీణ వాతావరణాన్ని పర్యాటకులు ఆస్వాదించేలా అక్కడ ప్రత్యేక హోమ్ స్టేలను అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రవాసాంధ్రులను (ఎన్ఆర్ఐ) కూడా భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ హోమ్ స్టేలు తప్పనిసరిగా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు.

### - కొత్త ప్రాజెక్టులతో పర్యాటకానికి కొత్త శోభ

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యాటకులను ఆకట్టుకునేలా వినూత్న ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఉండవల్లి గుహల వద్ద లైట్ అండ్ సౌండ్ షో, చింతపల్లిలో ఎకో టూరిజం ప్రాజెక్టు, కుప్పంలో ఏనుగుల సఫారీ, విశాఖపట్నంలో డాల్ఫిన్ షో వంటివి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గండికోట, తైడ, అరకు, సూర్యలంక, లంబసింగి వంటి ప్రాంతాల్లో టెంట్ సిటీలను వేగంగా ఏర్పాటు చేయాలన్నారు. చారిత్రక కొండపల్లి ఖిల్లా వంటి కట్టడాలను ప్రైవేటు సంస్థలు దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. రాజమండ్రిని ఒక ప్రత్యేక పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, చారిత్రక హేవ్లాక్ బ్రిడ్జిని పర్యాటక కేంద్రంగా మలిచే 'అఖండ గోదావరి' ప్రాజెక్టును త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. స్వదేశ్ దర్శన్, ప్రసాద్ వంటి పథకాల కింద చేపట్టిన బొర్రా గుహలు, సింహాచలం, అన్నవరం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### - స్థానిక ఉత్పత్తులతో బ్రాండింగ్.. వైభవంగా ఉత్సవాలు

ఆంధ్రప్రదేశ్ పర్యాటకానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకురావడానికి స్థానిక ఉత్పత్తులను బ్రాండింగ్‌కు వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన అరకు కాఫీ, అరుదైన ఎర్రచందనం బొమ్మలు, ఫర్నిచర్, మన సంప్రదాయ కూచిపూడి నృత్యం, మంగళగిరి, ధర్మవరం, వెంకటగిరి చేనేత వస్త్రాలను పర్యాటక కేంద్రాల్లో ప్రదర్శించడం ద్వారా రాష్ట్ర ప్రత్యేకతను చాటాలని అన్నారు. మరోవైపు, విజయవాడ దసరా ఉత్సవాలను మైసూరు దసరా ఉత్సవాల తరహాలో అత్యంత వైభవంగా నిర్వహించాలని ఆదేశించారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే ఈ ఉత్సవాల సమయంలో నగరాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి పండుగ వాతావరణం తీసుకురావాలన్నారు. ఈవెంట్లు జరిగే నగరాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యాటకుల భద్రత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని హెచ్చరించారు. ఈ సమీక్షలో మంత్రి కందుల దుర్గేష్ వర్చువల్‌గా పాల్గొనగా, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం, రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శన కోసం ఎంపిక చేసిన ఆరు పురాతన తెలుగు తాళపత్ర గ్రంథాలను ముఖ్యమంత్రి పరిశీలించారు.

# కాలనీ సమస్యలు తీర్చడానికి కృషి చేస్తా: ముప్పు శ్రీనివాస్ రెడ్డి

నాగారం (ప్రశ్న న్యూస్) నాగారం మున్సిపల్ పరిధి 14 వ వార్డు హెచ్ఎంటి సూర్య నగర్ కాలనీ నూతనంగా ఏర్పడిన కాలనీ అసోసియేషన్ సభ్యులు కాలనీ అధ్యక్షులు రోడ్ల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న సమస్యలపై కాలనీ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి తో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ టీజేఎస్ పార్టీ అధ్యక్షులు చిట్యాల శ్రీనివాస్ రెడ్డి , హెచ్ఎంటి సూర్య నగర్ కాలనీ జనరల్ సెక్రెటరీ కోట రామి నాయుడు, జాయింట్ సెక్రెటరీ పిట్టల రాజు , షేక్ గౌస్ , కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఎస్పీ మహేష్ బి. గితే పూజా కార్యక్రమం నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకొన్నారు. అనంతరం సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఈవినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారని, జిల్లా పరిదిలో ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది తాము మొదలు పెట్టిన పనులు ఎలాంటి విఘ్నాలు లేకుండా పూర్తి అయ్యేటట్లు చూడాలని మహాగణపతిని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగింది. ముఖ్యంగా జిల్లా పోలీసు శాఖ సూచించిన మేరకు ఆయా మండపాల నిర్వాహకులు, యువత జాగ్రత్తలు తీసుకోవడం కనిపించిందని, ఇదేరీతిలో నిమజ్జనం రోజు వరకు ప్రతి ఒక్కరు పోలీస్ వారికి సహకరించాలని ఎటువంటి ఆటంకాలు లేకుండా నిమజ్జన శోభయాత్ర నిర్వహించుకోవాలని ప్రజలకు ఎస్పీ తెలిపారు.అనంతరం పోలీస్ పోలీస్ కార్యాలయంలో గత ఏడూ రోజులుగా విశేష పూజలు అందుకున్న గణనాథుని శోభయాత్రను ఎస్పీ ప్రారంబించగా గణపతి దేవుని ప్రతిమను డప్పు వాయిద్యాలతో, పోలీస్ అధికారులు సిబ్బంది, పిల్లలు, మహిళల కోలాటం ఆట పాటలతో అందరు ఆనందోత్సవ నృత్యాలతో కోలాహలం మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి మానేరు నదిలో నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు , ఆర్ఐలు, ఎస్.ఐ లు, కార్యాలయ సిబ్బంది,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



తార్నాక(ప్రశ్న న్యూస్) గణేష్ నవరాత్రి ఉత్సవాలు తార్నాక లోని చింతల బస్తీలో యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం వినాయక మండపంలోకేపాల్ బోన్ సెట్టింగ్ సెంటర్ డాక్టర్ దిలీప్ రెడ్డి, రఘురాం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ గత 11 సంవత్సరాల నుంచి చింతల్ బస్తీలోని వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు టి లక్ష్మణ్, ఎం. చిన్న, టి.టి లక్ష్మణ్, మనోహర్, శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారానికి కూరగాయల బండి వినియోగం

- ఆది శీనన్న గెలుపులో భాగస్వామ్యం

తోపుడు బండినే ప్రచార వేదికగా

మార్చుకున్న అభిమానికి విప్ ఆది ఆశీస్సులు

మీ నిస్వార్థ అభిమానమే నా బలం - ఆది శ్రీనివాస్



వేములవాడ (ప్రశ్న న్యూస్)వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి కి చెందిన కదురు బాలయ్య జీవితం సాధారణం. ఉదయం లేస్తే కూరగాయల తోపుడు బండి నెట్టుకుని వీధుల వెంట తిరగడం.. అదే అతని జీవనోపాధి. కానీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆ బండి కేవలం జీవనోపాధి సాధనం మాత్రమే కాదు, తన హృదయంలో ఉన్న అభిమానాన్ని వ్యక్తం చేసే వేదికగా మారింది.తన అభిమాన నాయకుడు ఆది శ్రీనివాస్ గెలవాలని బలంగా కోరుకున్న బాలయ్య, తాను నిత్యం నెట్టే ఆ బండినే ప్రచార వాహనంగా మార్చుకున్నాడు. చిన్న మైక్ పెట్టి, "జననేత ఆది శీనన్నను గెలిపించండి" అంటూ గ్రామ గ్రామాన తిరిగాడు. తనకు ఉన్న అభిమానం మాటల్లో కాదు.. చర్యల్లో చూపించాడు.ప్రజల ఆశీర్వాదంతో ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా విజయం సాధించి, నేడు ప్రభుత్వ విప్‌గా ప్రజలకు మరింత చేరువయ్యారు. కానీ బాలయ్య చేసిన త్యాగాన్ని, ఆ చిన్న బండిపై నడిచిన గొప్ప ప్రేమను ఆయన మరువలేదు.బుధవారం ఆది శ్రీనివాస్ స్వయంగా నాంపల్లి – సాల రామన్నపల్లి చేరుకొని, కదురు బాలయ్య ఇంటికి వెళ్లారు. దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. "మీ లాంటి అభిమానులు ఉన్నంత వరకు నేను ప్రజల కోసం ఎప్పటికీ పనిచేస్తా" అని శీనన్న హామీ ఇచ్చారు.బాలయ్య కళ్లలో ఆనందభాష్పాలు.. ఆ రోజు తన బండిపై పెట్టిన మైక్‌కు ఈరోజు ప్రతిఫలం లభించిన రోజు అని సంతోషపడ్డాడు.

## రాజన్న సేవలో రాజమండ్రి ఇస్కాన్ ఆలయాధ్యక్షులు సత్య గోపీనాథ్ దాస్




వేములవాడ (ప్రశ్న న్యూస్) దక్షిణ భారతదేశ ఇస్కాన్ ఆలయాల అధ్యక్షులు, రాజమండ్రి ఇస్కాన్ ఆలయ గురువు సత్య గోపీనాథ్ దాస్ వేములవాడ రాజన్న ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం , నాగిరెడ్డి మండపంలో వేదపండితులు,ఆలయ అర్చకులచే వేదోక్త ఆశీర్వచనం చేశారు.ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ సత్య గోపీనాథ్ దాస్ కు శేషవస్త్రం సమర్పించి,స్వామివారి లడ్డూ ప్రసాదం అందజేశారు.వారి వెంట ప్రోటోకాల్ పర్యవేక్షకులు

## 42% శాతం బి.సి రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదించాలి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మల్కాజ్ గిరి అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ దళిత సంఘాల ఐకాస రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి ఆధ్వర్యంలో బిసి, ఎస్సి, ఎస్టి సంఘాలతో కలసి వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేసి మాట్లాడుతూ మొన్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై కనీసం చర్చ జరగకపోవడం బాధాకరమని అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీ లకు 42 శాతం రిజర్వరేషన్ల పై తీర్మానం చేసి కేంద్రానికి పంపినా పార్లమెంట్లో చర్చించక పోవడం కేంద్రము నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు తెలంగాణ ఎంపీలు కూడా పార్లమెంట్లో నోరెత్తక పోవడం బాధాకరమన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా ఉద్యోగాలు రాజకీయ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును ఆమోదించాలి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ప్రాతిపదికన రాజకీయంగా పోటీ చేసేందుకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు అవకాశాలు ఇవ్వాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేవరకు అన్ని సంఘాలతో కలసి పోరాటం చేయాలన్నారు 42 శాతం రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు అధ్యక్షులు ఎర్ర విజయ్ మాట్లాడుతూ ఈ పోరాటంలో దళిత,బహుజన విద్యార్థి యువజనులు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి తొందరగా అమలు అయ్యేవిధంగా చొరవ తీసుకోవాలన్నారు ఈ క్రమంలో నాయకులు హెూమరాజ్. ఉపాధ్యక్షులు,కిషోర్ జనరల్ సెక్రటరీ దళిత సంఘాల మెదక్ జిల్లా అధ్యక్షులు హృద్యరంజన్ అంబేద్కర్ సంఘం నాయకులు ప్రవీణ్, స్వామీ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో నిమజ్జనం ఏర్పాట్లు పటిష్టం - ఎస్పీ హెచ్చరిక

పట్టణంలోని పలు మండపాలను

సందర్శించిన జిల్లా ఎస్పీ : మహేష్ బీ గీతే



వేములవాడ (ప్రశ్న న్యూస్)వేములవాడ పట్టణంలో నేడు జరగనున్న గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు మండపాలను స్థానిక పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నిమజ్జనం నిర్దేశిత సమయానికి శాంతియుతంగా పూర్తవ్వాలని మండప నిర్వాహకులను కోరారు.నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు 200 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శోభాయాత్రలో డి.జేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి డి.జే వినియోగిస్తే, డి.జే యజమానులు, మండప నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతియుత వాతావరణంలో నిమజ్జనం పూర్తయ్యేలా చూడాలని ఎస్పీ సూచించారు.

## కృష్ణానగర్ గణపతి మండపంలో మహిళల సహస్ర దీపాలంకరణ

- అద్భుతంగా సాగిన దీపోత్సవం
- పెద్ద ఎత్తున మహిళల భాగస్వామ్యం
- గణపతి మండపంలో ప్రత్యేక పూజలు
- సహస్ర దీపాలంకరణతో సంపూర్ణ ఆధ్యాత్మిక శోభ



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలోని కృష్ణానగర్ గణపతి మండపంలో బుధవారం రాత్రి మహిళలు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడి ఆశీర్వాదం కోసం భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ చేసి మండపాన్ని అద్భుతంగా అలంకరించారు. ఈ సందర్భంగా వేద మంత్రాల మధ్య సాంప్రదాయ పద్ధతిలో హారతులు ఇచ్చి గణనాథుడిని కీర్తించారు.కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని భక్తి భావాన్ని వ్యక్తం చేశారు. గణనాథుడి ఆశీస్సులతో క్షేమం,శాంతి, శుభసమృద్ధి కలగాలని కోరుకున్నారు.ఈ నేపథ్యంలో ఈ ప్రాంతమంతా సంపూర్ణ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## ఎన్నికల ప్రచారానికి కూరగాయల బండి వినియోగం

- ఆది శీనన్న గెలుపులో భాగస్వామ్యం
- తోపుడు బండినే ప్రచార వేదికగా మార్చుకున్న అభిమానికి విప్ ఆది ఆశీస్సులు
- మీ నిస్వార్థ అభిమానమే నా బలం - ఆది శ్రీనివాస్



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి కి చెందిన కదురు బాలయ్య జీవితం సాధారణం. ఉదయం లేస్తే కూరగాయల తోపుడు బండి నెట్టుకుని వీధుల వెంట తిరగడం.. అదే అతని జీవనోపాధి. కానీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆ బండి కేవలం జీవనోపాధి సాధనం మాత్రమే కాదు, తన హృదయంలో ఉన్న అభిమానాన్ని వ్యక్తం చేసే వేదికగా మారింది.తన అభిమాన నాయకుడు ఆది శ్రీనివాస్ గెలవాలని బలంగా కోరుకున్న బాలయ్య, తాను నిత్యం నెట్టే ఆ బండినే ప్రచార వాహనంగా మార్చుకున్నాడు. చిన్న మైక్ పెట్టి, "జననేత ఆది శీనన్నను గెలిపించండి" అంటూ గ్రామ గ్రామాన తిరిగాడు. తనకు ఉన్న అభిమానం మాటల్లో కాదు.. చర్యల్లో చూపించాడు.ప్రజల ఆశీర్వాదంతో ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా విజయం సాధించి, నేడు ప్రభుత్వ విప్‌గా ప్రజలకు మరింత చేరువయ్యారు. కానీ బాలయ్య చేసిన త్యాగాన్ని, ఆ చిన్న బండిపై నడిచిన గొప్ప ప్రేమను ఆయన మరువలేదు.బుధవారం ఆది శ్రీనివాస్ స్వయంగా నాంపల్లి – సాల రామన్నపల్లి చేరుకొని, కదురు బాలయ్య ఇంటికి వెళ్లారు. దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. "మీ లాంటి అభిమానులు ఉన్నంత వరకు నేను ప్రజల కోసం ఎప్పటికీ పనిచేస్తా" అని శీనన్న హామీ ఇచ్చారు.బాలయ్య కళ్లలో ఆనందభాష్పాలు.. ఆ రోజు తన బండిపై పెట్టిన మైక్‌కు ఈరోజు ప్రతిఫలం లభించిన రోజు అని సంతోషపడ్డాడు.

## వినాయక నిమజ్జనంలో శాంతి భద్రతలకు సహకరించాలి

**బీజేపీ మండలాధ్యక్షులు : పంజాల ప్రశాంత్**



గంగాధర (ప్రశ్న న్యూస్) వినాయక నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా, ఎలాంటి అంతరాయం లేకుండా సాగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాల్సిన అవసరం ఉందని భారతీయ జనతా పార్టీ గంగాధర మండలాధ్యక్షులు పంజాల ప్రశాంత్ పేర్కొన్నారు. బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొంటూ , "నిమజ్జన సమయంలో ప్రజలు క్రమశిక్షణ పాటించి, హింసాత్మక చర్యలకు దూరంగా ఉండాలి. చట్టాలను గౌరవించి, పోలీసులకు సహకరించడం ద్వారా మన పండుగను మరింత ఆనందదాయకంగా మార్చుకోవచ్చు" అని తెలిపారు.అంతేకాకుండా ఆయన, "గణేష్ నిమజ్జనం మన సాంప్రదాయానికి ప్రతీక. అందరూ భక్తి, భద్రతలను సమన్వయం చేసుకుంటూ నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనాలి" అని ప్రశాంత్ పేర్కొన్నారు.

## వినాయక నిమజ్జనం శాంతియుతంగా సాగాలి - కోయల్కార్ మస్తాన్



వేములవాడ (ప్రశ్న న్యూస్)వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు విభాగానికి సహకరించాలని వేములవాడ మున్సిపల్ పరిధిలోని 21 వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోయల్కార్ మస్తాన్ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొంటూ , "నిమజ్జన సమయంలో ఎవరికీ అసౌకర్యం కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్రమశిక్షణతో వ్యవహరించాలి. హింసాత్మక చర్యలకు దూరంగా ఉండి, చట్టాలను గౌరవించడం ద్వారా పండుగ ఆనందాన్ని అందరికీ పంచుకోవచ్చు" అని పేర్కొన్నారు.అలాగే ఆయన, "గణేష్ నిమజ్జనం మన సాంప్రదాయం, సంస్కృతికి ప్రతీక. భక్తి, భద్రత, క్రమశిక్షణ సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనడం మనందరి బాధ్యత" అని పంజాల కోయల్కార్ మస్తాన్ వెల్లడించారు.

## తొగుట మండలంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి పర్యటన



**సిద్దిపేట** తొగుట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఓ పి రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేశారు. 30 కి పైగా ఓపి ఉన్నారని రోజు ఆసుపత్రికి పేషంట్ లు తాకిడి బాగా ఉంటుందని మెడికల్ ఆఫీసర్ రాధా కృష్ణ కలెక్టర్ కి తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సీజనల్ వ్యాధులకు సంబంధించి చికిత్స తో పాటు ఇంటిలో దోమలు ఉండకుండా జాగ్రత్త చర్యలు తెలపాలని సూచించారు. ల్యాబ్ కి వెళ్ళి ఎన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు, టీ హబ్ కి పంపిన శాంపిల్స్ రిజల్ట్ గూర్చి ఆరా తీశారు. ఫీవర్ తగ్గని వారికి డెంగ్యూ ఇతరత్రా పరీక్షల కోసం టి హబ్ కి పంపిస్తున్నామని పంపిన మరుసటి రోజే రిజల్ట్స్ వస్తాయని ల్యాబ్ టెక్నీషియన్ కలెక్టర్ కి తెలిపారు. ఆయుష్ వైద్యాన్ని మెరుగుపరచాలని ఆయుష్ డాక్టర్ నీ ఆదేశించారు. ఆసుపత్రి చుట్టూ శుభ్రం జిల్లా మొత్తం ఉద్యోగులతో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ రోజు మొక్కలు నాటాలని అధికారులకు తెలిపారు.అనంతరం తొగుట మండలంలోనీ తుక్కపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన గ్రామ పంచాయతీ కావున ఇంటి నిర్మాణాలు దాదాపు స్లాబ్ లెవెల్ కి వచ్చాయని అధికారులు కలెక్టర్ కి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారు మహమ్మద్ బుజీ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. మరుగుదొడ్డి ఇంటి లోపల కాకుండా బయట నిర్మించుకోవాలని సూచించారు. 600 స్క్వేర్ ఫీట్ మాత్రం మించకుండా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. మండలం లో కూడా 100% గ్రౌండింగ్ అయిన ఇండ్లు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీకాంత్, ఎం పి ఓ శ్యామల తదితరులు ఉన్నారు.

# నిమజ్జన వేడుకలు సజావుగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలి

**- వినాయక నిమజ్జనానికి పగడ్బందీ ఏర్పాట్లు పూర్తి**

**- వేములవాడ ఏఎస్పీ : శేషాద్రిని రెడ్డి**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో నేడు గురువారం జరిగే వినాయక నిమజ్జనోత్సవం నేపథ్యంలో పోలీసులు పగడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు 200 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు.నిమజ్జన కార్యక్రమం శాంతియుత వాతావరణంలో జరగాలని, ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రజలు పోలీసుల సూచనలను పాటించి,వేడుకలు సజావుగా జరిగేందుకు పోలీసులకు2 పట్టణ ప్రజలు సహకరించాలని ఏఎస్పీ కోరారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి సమావేశానికి అర్బన్ నుండి భారీగా నేతల తరలింపు

**- భాజపా గెలుపు లక్ష్యంగా కృషి చేస్తాం**

**- భాజపా అర్బన్ మండలాధ్యక్షులు : బుర్ర శేఖర్ గౌడ్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షులతో కరీంనగర్‌లో జరిగిన సమావేశానికి వేములవాడ అర్బన్ మండలం నుండి పెద్ద ఎత్తున బిజెపి కార్యకర్తలు తరలివెళ్లారు. మండల అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్ నేతృత్వంలో వందలాది మంది నేతలు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో కరీంనగర్ బయలుదేరారు.ఈ సందర్భంగా శేఖర్ గౌడ్ మాట్లాడుతూ, "రాష్ట్రంలో బిజెపి బలోపేతం కోసం ప్రతి బూత్ స్థాయిలో కట్టుబడి పనిచేస్తాం. ప్రజల సమస్యలను పరిష్కరించడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు.ఈ సమావేశంలో పార్టీ బలోపేతంపై కీలక వ్యూహాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై చర్చించనున్నట్లు వెల్లడించారు.

# మున్నూరుకాపు సభ్యత్వ నమోదులో విప్ ఆది సభ్యత్వానికి శ్రీకారం

**- రాజన్న సిరిసిల్లలో మున్నూరు కాపు సంఘం సభ్యత్వ విస్తరణ**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో మున్నూరు కాపు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో భాగంగా తన సభ్యత్వం స్వీకరించి, సభ్యత్వ విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొప్పా దేవయ్య, రాష్ట్ర కార్యదర్శి వారాల దేవయ్య, వేములవాడ పట్టణ అధ్యక్షుడు కోయినేని బాలయ్య, గౌరవ అధ్యక్షులు బింగి శ్రీనివాస్, నామాల పోశెట్టి, పట్టణ పటేల్ సంఘం అధ్యక్షుడు సారా శ్రీనివాస్, డాక్టర్ బిక్షపతి, గోలి తిరుపతి, ఎర్రం ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే అధికారిక నివాసంలో సంఘ సభ్యుల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

# సిగ్మా హాస్పిటల్లో బైరి లక్ష్మణ్ మృతిపై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కన్వీనర్ ఎంక్వైరీ

**: జిల్లా వైద్యాధికారి డా ప్రమోద్**

**-కుటుంబ సభ్యులతో విచారణ : జిల్లా ఉప వైద్యాధికారి డా. ఎన్ శ్రీనివాస్**

**-జిల్లా వైద్యాధికారి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కన్వీనర్ డా ప్రమోద్ కు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫిర్యాదు**




జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన బైరి లక్ష్మణ్ అనే వ్యక్తి ఆగస్టు 23న జగిత్యాల పట్టణం గొల్లపల్లి రోడ్ లో గల సిగ్మా హాస్పిటల్లో మృతి చెందాడన్న విషయం పాఠకులకు తెలిసిందే. నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్ జి ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా వైద్యాధికారి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కన్వీనర్ డా ప్రమోద్ ఆదేశాల మేరకు జిల్లా ఉప వైద్యాధికారి డా. ఎన్ శ్రీనివాస్, మృతుడు బైరి లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో విచారణ జరిపారని తెలిపారు.బైరి లక్ష్మణ్ ఆపరేషన్ కోసం ఆసుపత్రిలో చేరగా వైద్యులు శస్త్ర చికిత్స చేస్తుండగా అతను ఆపరేషన్ థియేటర్ లో మృతి చెందాడని తెలిపారు.అయితే ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే పేషెంట్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగిన విషయం పాఠకులకు తెలిసిందే.సిగ్మా హాస్పిటల్ లో చనిపోయిన కుటుంబాన్ని 2025 ఆగస్టు 24 న ఎన్ హెచ్ ఆర్ సి బృందం పరామర్శించారు. సిగ్మా హాస్పిటల్లో పేషెంట్ చనిపోయిన ఘటన పై దర్యాప్తు జరపాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో, చనిపోయిన బైరి లక్ష్మణ్ కుటుంబానికి న్యాయం జరగాలని, అసలు సిగ్మా హాస్పిటల్లో ఏం మాయ మాఫియా జరుగుతుంది అని ట్రీట్మెంట్ చేసిన డాక్టర్ ఎవరు? పేషంటు ఎందుకు చనిపోయారు? ఈ సంఘటనపై అన్ని విధాలుగా దర్యాప్తు చేసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో జిల్లా వైద్యాధికారి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కన్వీనర్ డా ప్రమోద్ కు పిర్యాదు చేశారని తెలిపారు.సిగ్మా హాస్పిటల్లో బైరి లక్ష్మణ్ మృతి చెందిన ఘటనపై ఎంక్వైరీ లో బైరి లక్ష్మణ్ కుటుంబ సభ్యులు హాజరయ్యారని తెలిపారు.

## నమో మిషన్ వందేగోమాతరం గౌరవాధ్యక్షులుగా

# తొగరి కరుణాకర్ నియామకం

**- గోమాతల సంరక్షణ కు కృషి చేస్తా - తొగరి కరుణాకర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్)గోమాత రక్షణను ప్రాధాన్యంగా తీసుకొని దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న "నమో మిషన్ వందే గోమాతరం సంస్థ" ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పదవులను భర్తీ చేసేందుకు నూతన బాధ్యులను ఎంపిక చేసింది. ఈ క్రమంలో వేములవాడ నియోజకవర్గం గౌరవ అధ్యక్షులుగా పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షులు తొగరి కరుణాకర్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ:"గోమాతల రక్షణ కోసం ఈ మిషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమైంది. నాపై నమ్మకం ఉంచి గౌరవ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన వీర మద్వి ఆచారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తాను" అని తెలిపారు.

# గణపయ్యకు ఘణమైన పూజలు



బడంగ్ పేట్(ప్రశ్న న్యూస్) గణేష్ నవరాత్రుల్లో భాగంగా మహేశ్వరం అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 119 వార్డులోని సభితా ఇంద్రారెడ్డి కాలనీ ఫేజ్ 2 పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక మంటపంలో వినాయక నవరాత్రుల ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పసునూరి రాజుచారి తెలిపారు. వినాయక నవరాత్రుల సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిఫల్ కార్పోరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి కమిటీ సభ్యులతో మండపాన్ని సందర్శించి వినాయకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని మండప నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా చిగురింత పారిజాత నర్సింహారెడ్డిని ఘనంగా సత్కరించడం జరిగిందని రాజుచారి తెలిపారు.

## ఘనంగా గణేష్ ఉత్సవాలలో ప్రముఖులకు ఆహ్వానం



కీసర( ప్రశ్న న్యూస్) రాంపల్లిలోని వినాయక ఉత్సవాలలో భాగంగా రాంపల్లిలోని బంగారు యువజన సంఘం ఆహ్వానం మేరకు విశ్వసుందరి అయిన డా. సృజన మేడం, డా.వంశీ కృష్ణ సౌమిత్ మీడియా డా.గంగి మల్లేష్ మిస్టర్ తెలంగాణ జి యం ఎస్ క్రియేషన్స్ నిర్మాత, నాలోల్ల కుమార్ రాంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గణేశుని ఉత్సవాలు దేశమంతా అంగరంగ వైభవంగా జరుగుతాయని ఆమె అన్నారు. డాక్టర్ గాని మల్లేష్ మాట్లాడుతూ ప్రతి పని మొదలు పెట్టాలన్న మొదట గణనాధుని పూజ చేశాకే ఇతర పూజలు చేస్తామని ఆయన అన్నారు. అందులో భాగంగానే గణేశుని ఉత్సవాల్లో పాల్గొనడం మాకెంతో ఆనందంగా ఉందని నిర్వాహకులు చేసిన ఏర్పాట్లు చేశారని అన్నారు. అనంతరం రామపల్లిలో గోల్డెన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాతో మొమెంటోస్ తో సన్మానించేరు.ఈ కార్యక్రమంలో బంగారు యువకులు, మరియు గ్రామ నాయకులు భాస్కర్, నర్సింగరావు తాడి తరులు, గ్రామప్రజలు, మీడియా మిత్రులు యాదగిరి పాల్గొన్నారు.

## ఘనంగా పూజలందుకుంటున్న రత్నానగర్ గణపతి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నల్లకుంట డివిజన్ రత్ననగర్ లో వోల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం అందరినీ విశేషంగా ఆకట్టుకుంటుంది. గణపతిని 80 గ్రాముల వెండితో అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నేత రాజేష్ లాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండప నిర్వహకులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో ముఖేష్, గణేష్, ప్రకాష్, విజయ్, సాయి గణేష్, సాయి కిరణ్, మహేష్, ఉపేందర్, మనీష్, శివ, పాండు తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవ మైనార్టీ సమస్యల పరిష్కారానికి చర్యలు

**- తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్**




సిరిసిల్ల( ప్రశ్న న్యూస్)క్రైస్తవ మైనార్టీ సమస్యల పరిష్కారానికి అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు.బుధవారం క్రైస్తవ సంక్షేమం పై తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పాస్టర్ లతో సమావేశం నిర్వహించారు.క్రైస్తవ బరియల్ గ్రౌండ్స్ అభివృద్ధి, భూ కేటాయింపు, చర్చి నిర్మాణ అనుమతులు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, క్రైస్తవ మైనారిటీలకు కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీ, పీఎం 15 పాయింట్ ప్రోగ్రాం పై చర్చించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ, క్రైస్తవ సోదరుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. క్రైస్తవ సోదరులకు ఉన్న ప్రతి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్ట చర్యలు తీసుకుంటుందని అన్నారు. క్రైస్తవ సోదరులకు ఏవైనా సమస్యలు ఉంటే సోమవారం జరిగే ప్రధాని కార్యక్రమంలో సమర్పించాలని, ప్రాధాన్యత అంశంగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 571 అనుసరించి అవకాశం మేరకు భూ కేటాయింపులు చేయడం జరుగుతుందని అన్నారు. క్రైస్తవ సోదరులకు భూ సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత లింకు డాక్యుమెంట్స్ సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. చర్చిల నిర్మాణానికి నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు 15 రోజుల లోగా జారీ చేయడం జరుగుతుందని అన్నారు. కుల ధ్రువీకరణ పత్రం 15 రోజులలో మీసేవ యాక్ట్ సిటీజన్ చార్టర్ ప్రకారం జారీ చేస్తామని అన్నారు. చర్చిల నిర్మాణానికి ఆన్లైన్లో అన్ని పర్మిషన్లు తీసుకున్న తర్వాత పనులు మొదలు పెట్టాలని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ కింద స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు సహకారం అందిస్తామని అన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవకాశం మేరకు పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రుణాలకు క్రిస్టియన్ మతం తీసుకున్న వారు అందరూ అర్హులు అవుతారని అన్నారు.సమావేశంలో పాల్గొన్న పాస్టర్స్ మాట్లాడుతూ జిల్లాలో క్రైస్తవుల కోసం స్మశాన వాటిక , కమ్యూనిటీ హాల్స్, చర్చిల నిర్మాణానికి అనువైన స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్టీవో రాధాబాయి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం. ఏ.భారతి జిల్లాలోని పాస్టర్స్ సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గోన్నారు.



# నిర్మాణ సంస్థను మూసేస్తున్న దర్శకుడు




ప్రమాణాలు పడిపోయిన తమిళ ఫిలిం ఇండస్ట్రీలో గత రెండు దశాబ్దాల్లో వచ్చిన మేటి దర్శకుల్లో ఒకడిగా వెట్రిమారన్‌ను చెప్పొచ్చు. తొలి చిత్రం 'పొల్లాదవన్'తో మొదలుపెడితే ఆడుగళం, విసారణై, వడ చెన్నై, అసురన్, విడుదల.. ఇలా వెట్రిమారన్ ప్రతి చిత్రం ఒక కళాఖండమే. దర్శకుడిగా మంచి పేరు వచ్చాక అతను నిర్మాతగా కూడా మారాడు. గ్రాస్ రూట్ ఫిలిమ్ కంపెనీ సంస్థలో రెండంకెల సంఖ్యలో సినిమాలు నిర్మించాడు. ఈ సంస్థలో వచ్చిన సినిమాలు చాలా వరకు హిట్లే. అయినా సరే.. వెట్రిమారన్ తన ప్రొడక్షన్ హౌస్‌ను మూసేయాలనే కఠిన నిర్ణయం తీసుకోవడం గమనార్హం. నిర్మాతగా ఒత్తిడిని తట్టుకోవడం కష్టంగా ఉందని.. అందుకే ప్రొడక్షన్ ఆపేస్తున్నానని అతను ప్రకటించాడు. వెట్రిమారన్ సంస్థ నుంచి రానున్న చివరి చిత్రం.. బ్యాడ్ గర్ల్. ఆ చిత్రం సెప్టెంబరు 5న రిలీజ్ కాబోతోంది.వెట్రిమారన్ తన ప్రొడక్షన్లో కొన్ని రెవల్యూషనరీ ఫిలిమ్స్ నిర్మించాడు. వాటి వల్ల వివాదాలు తప్పలేదు. ముఖ్యంగా ఒక టీనేజీ అమ్మాయి రొమాంటిక్ ఫాంటసీల చుట్టూ తిరిగే 'బ్యాడ్ గర్ల్' ప్రోమోలు తీవ్ర విమర్శలకు దారి తీసి.. విడుదల బాగా ఆలస్యం అయింది. మరోవైపు ఆండ్రియా జెరెమీ ప్రధాన పాత్ర పోషించిన 'మానుషి' మరింత వివాదాస్పదమైంది. ఆ సినిమాపై యాంటీ నేషనల్ ముద్ర పడడంతో విడుదలకు అడ్డంకులు తప్పలేదు. కోర్టు కేసుల్లో చిక్కుకున్న సెన్సార్ బోర్డు ఆ సినిమాకు క్లియరెన్స్ ఇవ్వలేదు. ఈ రెండు చిత్రాలూ వెట్రిమారన్‌ను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయి. ఆర్థికంగా తలెత్తే ఇబ్బందులకు తోడు దర్శకుడిగా ఆయన చేసే సినిమాల మీద వీటి ప్రభావం పడుతోంది. అందుకే ఈ తలనొప్పులన్నీ ఎందుకు అని ఆయన తన నిర్మాణ సంస్థనే మూసేస్తున్నట్లు ప్రకటించాడు. త్వరలో శింబుతో వెట్రి 'వడ చెన్నై' తరహా రా అండ్ రస్టిక్ ఫిలిం తీయబోతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.

# నటి రన్యారావుకి మరో బిగ్ షాక్..!

ప్రముఖ కన్నడ నటి రన్యారావుకు మరో బిగ్ షాక్ తగిలినట్టైంది. గోల్డ్ స్మగ్లింగ్ కేసులో నటి రన్యారావు జైలులో ఉన్న సంగతి తెలిసిందే.త్జాజాగా ఆమెకు డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) భారీగా జరిమానా విధించింది. రూ.102.55 కోట్లకు పైగా జరిమానా విధిస్తూ డీఆర్ఐ నోటీసులు పంపింది. నటి రన్యారావుతో పాటు మొత్తం నలుగురు నిందితులపై రూ.270 కోట్ల పెనాల్టీ విధించింది. జరిమానా చెల్లించకపోతే ఆస్తుల జప్తు ఉంటుందని వారికి నోటీసుల్లో హెచ్చరించింది. నిందితులు ప్రస్తుతం బెంగళూరు సెంట్రల్ జైల్లో ఉన్నారు. జైల్లోనే డీఆర్ఐ అధికారులు వారికి నోటీసులు అందజేశారు. దాదాపు 2500 పేజీలతో కూడిన పెనాల్టీ నోటీసులు ఇచ్చినట్లు డీఆర్ఐ అధికారులు వెల్లడించారు. కాగా, బంగారం అక్రమంగా తరలిస్తూ నటి రన్యారావు పట్టుబడిన విషయం తెలిసిందే. మార్చి 3న బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో 14.8 కిలోల బంగారంతో ఆమె పట్టుబడ్డారు. పోలీసుల విచారణలో సంచలన విషయాలు తెలుసుకున్నారు. 2023 నుంచి 2025 మధ్య కాలంలో ఆమె ఏకంగా 52 సార్లు దుబాయ్ ట్రిప్ వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. ఆమె ఇంట్లో అధికారులు తనిఖీలు చేసి.. భారీగా డబ్బులు, నగదు స్వాధీనం చేసుకున్నారు.




# ఓటీటీలోకి కన్నప్ప వచ్చేస్తున్నాడు



మంచు ఫ్యామిలీకి ఎంతో ప్రతిష్టాత్మకమైన చిత్రం.. 'కన్నప్ప'. ఈ సినిమా తీయడానికి పుష్కర కాలం క్రితమే సన్నాహాలు మొదలుపెట్టాడు మంచు విష్ణు. కొడుకు కలల సినిమాకు మోహన్ బాబు ఇవ్వాల్సిన సహకారం అంతా ఇచ్చారు. మేకింగ్ ఆలస్యమై.. రిలీజ్ వాయిదాల మీద వాయిదాలు పడి.. చివరికి జూన్ నెలాఖర్లో ప్రేక్షకుల ముందుకు వచ్చిందీ సినిమా. రూ.200 కోట్లకు పైగా బడ్జెట్ పెట్టి తీసిన ఈ సినిమా తొలి వీకెండ్లో ప్రేక్షకుల నుంచి మంచి స్పందనే తెచ్చుకుంది కానీ.. తర్వాత నిలబడలేకపోయింది. రిలీజ్ ముంగిట ఈ సినిమా ఓటీటీ, శాటిలైట్ హక్కులను సైతం మంచు విష్ణు అమ్మలేదు. కట్ చేస్తే కన్నప్ప రిలీజ్ తర్వాత మిగతా సినిమాల్లా నెల రోజుల్లో ఓటీటీలోకి రాలేదు.విడుదలైన మూడు నెలల తర్వాత కానీ ఆ చిత్రానికి ఓటీటీ డీల్ ఖరారు కాలేదు. హక్కులను ఎంత మొత్తానికి అమ్మారు అన్నది క్లారిటీ లేదు కానీ.. కన్నప్ప స్ట్రీమింగ్ డేట్ మాత్రం వచ్చేసింది. సెప్టెంబరు 4 నుంచి స్ట్రీమింగ్ జెయింట్ అమేజాన్ ప్రైమ్‌లో ఈ సినిమా డిజిటల్‌గా విడుదల కానుంది. అతిథి పాత్రే అయినప్పటికీ ప్రభాస్ నటించిన సినిమా కావడంతో ఈ సినిమాను థియేటర్లలో మిస్సయిన వాళ్లు ఓటీటీలో చూడాలని ఎదురు చూస్తున్నారు. సినిమాకు యావరేజ్ టాక్ రావడం, క్లైమాక్స్ అద్భుతమని, మంచు విష్ణు కెరీర్ బెస్ట్ పెర్ఫామెన్స్ అని టాక్ వచ్చిన నేపథ్యంలో ఓటీటీలో ఈ సినిమాను ఎంతమంది చూస్తారో వేచి చూడాలి. ఈ రోజుల్లో పెద్ద సినిమాలన్నీ విడుదలకు ముందే డిజిటల్ డీల్స్ ఖరారు చేసుకుంటున్నాయి. కానీ కన్నప్పకు మాత్రం అలా జరగలేదు. అలా అని ఆ సినిమాకు ఆఫర్లు రాలేదని కాదు. విడుదల ముంగిట కొన్ని ఓటీటీ సంస్థలతో అతను సంప్రదింపులు జరిపాడు. ఐతే ఒక ప్రముఖ ఓటీటీ సంస్థ కోట్ చేసిన రేటు నచ్చక.. హిట్టు కొట్టి ఆ తర్వాత డీల్ మాట్లాడతానంటూ ఛాలెంజ్ చేసిన విషయాన్ని విష్ణునే స్వయంగా వెల్లడించాడు. బహుశా అది అమేజాన్ ప్రైమే కావవచ్చేమో. మరి

# వివాదంలో కళ్యాణి ప్రియదర్శన్ సినిమా..



మలయాళ బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్, నస్లేన్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ 'లోకా: చాప్టర్-1 చంద్ర'. డామినిక్ అరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు దుల్కర్ సల్మాన్ నిర్మించారు. ఈ మూవీ భారీ అంచనాల మధ్య ఆగస్టు 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంటూ దూసుకుపోతుంది. ఈక్రమంలో.. 'లోకా' చిత్రంలోని డైలాగ్స్ వివాదాస్పదమైనట్లు పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. క్లైమాక్స్‌లో విలన్ మాట్లాడుతూ..'బెంగళూరుకి చెందిన అమ్మాయిలని పెళ్లి చేసుకోను. ఎందుకంటే వాళ్లు వ్యక్తిత్వం లేనివాళ్లు' అంటూ ఓ డైలాగ్ చెప్పినట్లుగా వార్తలొస్తున్నాయి. అదే కాకుండా ఈ మూవీలో 'దగర్' అనే వాడినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో నెటిజన్లు మూవీ టీమ్‌పై ఫుల్ ఫైర్ అవుతున్నారు. తాజాగా, దుల్కర్ సల్మాన్ ట్విట్టర్ ద్వారా క్షమాపణలు చెప్తూ ఓ నోట్ రిలీజ్ చేశారు. "మా సినిమా 'లోకా చాప్టర్-1 చంద్ర'లోని ఓ డైలాగ్ కర్ణాటక ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని తెలుసుకుని మేము చాలా చింతిస్తున్నాము. ప్రజల మనోభావాలకే మేము మొదటి ప్రాధాన్యత ఇస్తాం. ఈ విషయంలో ఎవరినీ బాధపెట్టే ఉద్దేశం మాకు లేదు. సినిమాలోని వివాదాస్పదనమైన డైలాగ్స్‌కు త్వరలోనే మార్చడం లేదా తొలగించడం చేస్తాము. కన్నడ ప్రజలకు కలిగిన ఇబ్బందికి మేము మనస్ఫూర్తిగా క్షమాపణలు

# అనుమతి లేకుండా నా ఫొటోలు వాడుకుంటారా?

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ సోనాక్షి సిన్హా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ షాకింగ్ పోస్ట్ పెట్టింది. ఓ వెబ్‌సైట్ వాళ్లు తనకు తెలియకుండా తన ఫొటోలు వాడుకున్నట్లు తెలుపుతూ వారిని హెచ్చరించింది.ఈ విషయాన్ని తెలుపుతూ నోట్ రిలీజ్ చేసింది. "నేను ఎక్కువగా ఆన్‌లైన్ షాకింగ్ చేస్తుంటాను. అయితే ఈ మధ్య కొన్ని బ్రాండెడ్ వెబ్‌సైట్స్‌లలో నా ఫొటోలు పెట్టారు. అది చూసి నేను షాకయ్యాను. నన్ను సంప్రదించకుండా, నా అనుమతి లేకుండా, నన్ను రిక్వెస్ట్ చేయకుండా నా పిక్స్ ఎలా ఉపయోగించుకుంటారు. ఇది నేను సహించలేకపోయాను. ఒక నటిగా నేను కొత్త దుస్తులు, అభరణాలు ధరిస్తుంటాను. అలాంటప్పుడు ఆ డ్రెస్ వివరాలు దాని బ్రాండ్‌కు క్రెడిట్ ఇస్తూ పోస్ట్ చేస్తాను.అలా పోస్ట్‌లో చెప్పినంత మాత్రాన నా ఫొటోలు మీ వెబ్‌సైట్‌కు ఉపయోగించుకుంటారా?. కనీస నైతిక బాధ్యత వహించరా? ఇలా చేయడం సరైన పద్ధతి కాదు. నేను వివరాలు వెల్లడించక ముందే నా ఫొటోలు తొలగించండి. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాను" అని రాసుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. కాగా.. సోనాక్షి సినిమాల విషయానికొస్తే.. ఇటీవల 'నికితా రాయ్' మూవీతో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం 'జటాధర' సినిమాలో నటిస్తోంది. ఇందులో టాలీవుడ్ హీరో సుధీర్ బాబు హీరోగా నటిస్తుండగా.. సోనాక్షి హీరోయిన్‌గా చేస్తోంది. పౌరాణిక, మిస్టరీ థ్రిల్లర్ చిత్రంగా తెరకెక్కుతుండగా.. వెంకట్ కళ్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో సూపర్ స్టార్ మహేష్ బాబు మరదలు శిల్పా శిరోద్కర్ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తోంది. జీ స్టూడియోస్ సమర్పణలో, ఉమేష్ కుమార్ బన్సాల్, ప్రేరణ అరోరాతో కలిసి శివిన్ నారంగ్, నిఖిల్ నందా, అరుణ అగర్వాల్, శిల్పా సింఘాల్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



# ఘాటీపై హై ఎక్స్‌పెక్టేషన్స్ పెంచేస్తున్న డైరెక్టర్

అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'ఘాటీ'. విక్రమ్ ప్రభు లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ మూవీకి విజనరీ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఖఎ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే ఈ సినిమాపై పాజిటివ్ వైబ్ క్రియేట్ కాగా.. భారీ అంచనాల మధ్య ఈ సినిమా సెప్టెంబర్ 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. దీంతో తాజాగా మీడియాకు ఓ స్పెషల్ ఇంటర్వ్యూ ఇచ్చారు డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి. 'నా ప్రతి సినిమా ఒక అడ్వెంచర్ లాంటిదే. ఘాటీ విషయానికొస్తే.. ఆంధ్ర ఒరిస్సా బోర్డర్లో శిలావతి గాంజా రకం పెరుగుతుంది. దానికోసం ఒక వ్యవస్థ పని చేస్తుంటుంది. వాటిని మోయడానికి ఉండే కూలీలను ఘాటీలని పిలుస్తారు. వాళ్ళ నేపథ్యం గురించి రచయిత చింతకింద శ్రీనివాసరావు చెప్పినప్పుడు చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. 30 పేజీల కథగా రాశారు. చాలా నచ్చింది. దాన్ని డెవలప్ చేయడం మొదలు పెట్టాను. లొకేషన్ కోసం తూర్పు కనుమలకు వెళ్లాను. అదంతా ఒక కొత్త ప్రపంచం. జీవన శైలి అంతా కొత్తగా ఉంది. ఒక కొత్త ప్రపంచం, కల్చర్‌ని చూపించే ఆస్కారం ఉండటంతో ఘాటీ మొదలుపెట్టాం. ఘాటీ కథ పూర్తిగా ఫిక్షనల్. గంజాయి అనేది ఒక సోషల్ ఇష్యూ. ప్రభుత్వాలు ఉక్కుపాదంతో అణిచివేయాలని ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే అవన్నీ దాటి గంజాయి అనేది సమాజంలోకి వస్తుంది. సర్వైవల్ కోసం చేసినా పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయి. ఐడెంటిటీ, సర్వైవల్ థీమ్స్‌తో వస్తున్న సినిమా ఇది. సామాజిక సమస్యలపై ప్రభుత్వాలే కాకుండా పౌరులందరూ పోరాడాలి. ఘాటి కథని యాక్షన్‌తో చెబితేనే ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఎందుకంటే అక్కడ ఉన్న పరిస్థితులు అలాంటివి. చాలా తీవ్రమైన పాత్రలు, తీవ్రమైన భావోద్వేగాలతో ఉంటాయి. యాక్షన్ సీక్వెన్స్‌లో ఆ ఎమోషన్ కనిపిస్తుంది. ఎమోషన్స్, పెర్ఫార్మెన్స్, లొకేషన్స్ పరంగా



# అమ్మడు క్రేజ్‌కు ఫ్యాన్స్ ఫిదా



'లోఫర్' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన బాలీవుడ్ బ్యూటీ దిశా పటాని.. తెలుగులో అంతగా గుర్తింపు తెచ్చుకోనప్పటికీ బాలీవుడ్‌లో మాత్రం బ్యాక్ టు బ్యాక్ చిత్రాలు అనౌన్స్ చేస్తుంది. ఇక గతేడాది వచ్చిన 'కల్కి' చిత్రంతో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు తెచ్చుకుని ఇప్పుడు మరోసారి ప్రభాస్‌తో జత కట్టేందుకు సిద్ధం అయింది. ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా ఫిక్స్ అయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సినిమాతో బిజీగా ఉంటూనే మరో మూవీలో జాయిన్ అయ్యింది ఈ బ్యూటీ. దిశా పటానీ బాలీవుడ్‌లో విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ మూవీ చేయబోతుంది. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో షాహిద్ కపూర్ హీరో కాగా.. త్రిప్తి డిమ్రి, నానా పటేకర్, రణదీప్ హుడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ మూవీలో దిశా పటానీ అతిథి పాత్రకు ఎంపిక అయింది. అంతే కాకుండా.. రీసెంట్‌గా షూటింగ్‌లో కూడా జాయిన్ అయినట్లు తెలుస్తుంది. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన న్యూస్ నెట్టింట వైరల్ అవుతుండగా.. బాలీవుడ్‌లో దిశాకు ఉన్న క్రేజ్ చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు ఫ్యాన్స్.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ - ప్రగాఢ సంతాపం



వేములవాడ (ప్రశ్న న్యూస్)వేములవాడ పట్టణంలోని సుబ్రహ్మణ్యం నగర్ కు చెందిన "ఉటుకూరి ప్రమీల" ఇటీవల మరణించగా,మృతురాలి కుటుంబాన్ని బుధవారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించి,వారి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.వారి వెంట మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాస్,దేవరాజు,ఉమర్ ,రఫీ , ఫర్వేజ్ తదితరులు ఉన్నారు.

# ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవం, యువ మనసులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పోషించే అపారమైన పాత్రను గుర్తుచేసే ప్రత్యేక సందర్భం. సెయింట్ ఆండ్రూస్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్గా, ప్రతి బిడ్డ భవిష్యత్తును నిర్మించడానికి తమ సమయం, శక్తి, ప్రేమను నిస్వార్థంగా వెచ్చించే మా ఉపాధ్యాయులందరిపట్ల నేను అపారమైన గౌరవం కృతజ్ఞతతో నిలబడ్డారు.ఈ సందర్భంలో తల్లిదండ్రులను కూడా ఉద్దేశించి ఒక సందేశం చెప్పాలనుకుంటున్నారు. పిల్లల జీవితాల్లో ఉపాధ్యాయులు కేవలం బోధకులు మాత్రమే కాదు వారు మార్గదర్శకులు, మెంటార్లు, కొన్నిసార్లు రెండవ తల్లిదండ్రులుగా మారతారు. అందుకే, వారి కృషికి తగిన గౌరవం ప్రోత్సాహం ఇవ్వడం మనందరి బాధ్యత అన్నారు. నేటి కాలంలో చాలా మంది తల్లిదండ్రులు "సున్నితమైన పేరెంటింగ్" అనే శైలిని అనుసరిస్తున్నారు. దీని వెనుక ఉన్న ఉద్దేశం శ్రేయస్కరమే పిల్లలను వినడం, సానుభూతితో చూడడం, వారికి స్వేచ్ఛ ఇవ్వడం. కానీ, ఇది కొన్నిసార్లు అతిగా మరీ తేలికైన పెంపకానికి దారి తీస్తుంది. ప్రతి కోరిక నెరవేరడం, తప్పు ప్రవర్తనను సాధారణం అని పక్కన పెట్టడం వల్ల పిల్లలలో నియమ నిబంధనల పట్ల గౌరవం తగ్గిపోతుంది.ఇల్లు, పాఠశాలలోని క్రమశిక్షణ ఒకదానికొకటి తోడ్పడాలి. తల్లిదండ్రులు బలమైన విలువలను, పరిమితులను బోధించకపోతే, ఉపాధ్యాయులు ఎంత కృషి చేసినా ఆ లోటును భర్తీ చేయడం కష్టమవుతుంది. ఉపాధ్యాయులు ప్రేరేపించగలరు, పెంపొందించగలరు, మార్గనిర్దేశం చేయగలరు కానీ తల్లిదండ్రుల పాత్రను పూర్తిగా భర్తీ చేయలేరు. ఇప్పుడు మనం ఆలోచించాలి. మన పిల్లలు కష్టపడి పనిచేయడం, పెద్దలకు గౌరవం ఇవ్వడం, "వద్దు" అనే సమాధానాన్ని అంగీకరించడం నేర్చుకుంటున్నారా.? లేక ప్రతి కోరిక నెరవేరాలనే అంచనాతో పెరుగుతున్నారా.?విద్య అనేది ఉమ్మడి బాధ్యత. ఇల్లు, పాఠశాల కలిసికట్టుగా పనిచేస్తే పిల్లలు వికసిస్తారు. కానీ తల్లిదండ్రులు పట్టించుకోని లోటును ఉపాధ్యాయులు సరిచేయాలని ఆశిస్తే, చివరికి నష్టపోవడం పిల్లలకే జరుగుతుంది.మన పిల్లలకు సమతుల్యత అనే బహుమతి ఇవ్వుదాం, పరిమితులతో కూడిన ప్రేమ, బాధ్యతతో కూడిన స్వేచ్ఛ,క్రమశిక్షణతో కూడిన సానుభూతి,ఇలా పెరిగిన పిల్లలు బలమైన, గౌరవప్రదమైన, సమర్థులైన వ్యక్తులుగా ఎదుగుతారు. "ఇంట్లో క్రమశిక్షణ పాఠశాలలో గౌరవాన్ని పెంచుతుంది కలిసి ఇవి పిల్లల స్వభావాన్ని నిర్మిస్తాయి.ఈ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపి, వారిని ఘనంగా జరుపుకుందాం. వారు ప్రేమతో, నిబద్ధతతో, ప్రేరణతో




భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దుతున్నారు ఈ సేవకు మనందరం గర్వపడాలని సెయింట్ ఆండ్రూస్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ యాస్మీన్ షేక్ అన్నారు.

# రాజన్నాలయ ఈఓ కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ లీగల్ సెల్ ప్రతినిధులు

**- రాజన్నాలయ అభివృద్ధి కి సంపూర్ణ సహకారం**
**- టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ : బుర్ర రవితేజ గౌడ్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రమాదేవిని బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ న్యాయవాద బృందం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈఓకు పూల మొక్కను అందజేసి,శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ బుర్ర రవితేజ గౌడ్, డీసీసీ లీగల్ సెల్ రాజన్న జిల్లా చైర్మన్ ఇరుకుల అశ్విన్, వెంకట్ రెడ్డి, భగవాన్, వివేక్, జెట్టి శేఖర్, వేణు, మహేష్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ బుర్ర రవితేజ గౌడ్ మాట్లాడుతూ, "వేములవాడ రాజన్న ఆలయం రాష్ట్ర ప్రజల విశ్వాసానికి కేంద్ర బిందువుగా ఉంది. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం కాంగ్రెస్ లీగల్ టీం ఎల్లప్పుడూ సహకరించేందుకు సిద్ధంగా ఉంటుంది. భవిష్యత్తులో ఆలయానికి సంబంధించిన న్యాయపరమైన సలహాలు, సహాయం అవసరమైతే మేము ఎప్పుడూ అందుబాటులో ఉంటాం" అని అన్నారు.అనంతరంఈఓ రమాదేవి మాట్లాడుతూ, "వేములవాడ ఆలయం మరింత అభివృద్ధి చెందేలా సమర్థవంతంగా కృషి చేస్తాను. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తాయి. మీరు అందిస్తున్న శుభాకాంక్షలు నాకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయి" అని పేర్కొన్నారు.

# గణేష్ నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు



వేములవాడ (ప్రశ్న న్యూస్)వేములవాడలో నేడు గురువారం జరగనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమం కోసం వేములవాడ చెరువుకట్ట వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన స్థలాన్ని బీజేపీ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప్ రామకృష్ణ తదితరులు అక్కడి ఏర్పాట్లను సమీక్షించారు.రామకృష్ణ మాట్లాడుతూ, "గురువారం లోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ శాఖ అధికారులను, పోలీస్ శాఖ కూడా తగిన భద్రతా చర్యలు చేపట్టి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందిని నియమించాలని కోరాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్,తదితర భాజపా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# గణపతి హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జల దంపతులు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి పట్టణం కుమారస్వామి తిప్ప వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద సిద్దులయ్య,హరి లు ఏర్పాటు చేసిన హోమం నందు పాల్గొన్న శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి దంపతులు అనంతరం ఎమ్మెల్యే దంపతులు అన్నదాన కార్యక్రమం లో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలు వడ్డించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులు పిలుపు మేరకు ఈ హోమానికి వచ్చామని లోకాకళ్యాణం కోసం ఈ హోమం జరిగిందని ఈ హోమం లో పాల్గొనడం మా అదృష్టంగా భావిస్తున్నమని తెలిపారు.

# సుబ్బరామిరెడ్డి మృతి పట్ల సంతాపం తెలియజేసిన తలపా దామోదరం రెడ్డి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) వైయస్ రాజశేఖర్ రెడ్డి వీరాభిమాని నిడిగింటి సుబ్బిరామిరెడ్డి మృతి వార్త నిన్న వెంటనే వారి పార్థివ దేహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించిన శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి. మాట్లాడుతూ వైయస్సార్ వీరాభిమాని నిడిగింటి సుబ్బరామిరెడ్డి హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి,పట్టణ యువత అధ్యక్షులు ఆంటోనీ,తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 7న హైదరాబాదులో జరిగే ఐఎఫ్టియు రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

**- ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు**




దర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఐఎఫ్టియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పోస్టర్లను ఆవిష్కరించి, రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు కార్మికులకు పిలుపునిచ్చారు.2016 అక్టోబర్ 26 తేదీన సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఒకే పనికి రెండు రకాల వేతనములు ఇవ్వడం వివక్షత అని తీర్పు ఇచ్చినప్పటికీ గత తొమ్మిది సంవత్సరాల నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడం శోచనీయమని ఆయన అన్నారు. కార్మికుల కనీస వేతనాలు పెంచి, ఉపాధి పద్ధతి కల్పించని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకురావడం విచారకరమని ఆయన అన్నారు. రాష్ట్రంలో జిపి, మున్సిపల్, కార్మికులు స్వచ్ఛభారత్ లో స్వచ్ఛ తెలంగాణలో ముందు వరుసలో ఉండి ప్రజారోగ్యం కోసం పనిచేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని, కానీ వారి వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయడం తగదని ఆయన పాలకులను నిలదీశారు.
ప్రభుత్వ రంగ సంస్థలను ఒక దిక్కు మోడీ ప్రభుత్వం బహిరంగంగా వేలం వేస్తా ఉంటే, కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందని ఆయన తెలిపారు. విద్యా, వైద్యం, సింగరేణి, రైల్వే , ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరిచే కుట్ర మానుకోవాలని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. కనీస వేతనం 26 000 కనీస పెన్షన్ 10000 ప్రకటించి ఇవ్వాలని ఆయన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం సఫాయి కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేసి, ఉపాధి పద్ధతి కల్పించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు వి.బాలయ్య, వి.పద్మ, వెంకటి, ప్రజాసంఘాల నాయకులు భూమేష్, ఎల్లయ్య, నర్సా గౌడ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమ పూజ - అన్నదాన సేవలు



గంగాధర (ప్రశ్న న్యూస్) గంగాధర మండలం, మల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నడింపల్లి గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వినాయకుని వద్ద ప్రత్యేక కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన సేవా కార్యక్రమం చేపట్టారు. గ్రామ పెద్దలు,యువకులు,ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని గణనాథుని కృపకు పాత్రులయ్యారు.

# వేములవాడలో హిందూ ఉత్సవానికి ముస్లిం నాయకుడి తోడ్పాటు

**- స్థానికుల ప్రశంసలు**
**- సుభాష్ నగర్ వినాయక ఉత్సవాల్లో షాహిద్ పాషా సహాయం**
**- సామాజిక సమగ్రతకు చిహ్నం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలో మతసౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచే ఘట్టం చోటుచేసుకుంది. సుభాష్ ఐడియల్స్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల మండపానికి అవసరమైన విద్యుత్ లైట్ల ఏర్పాటుకు ముస్లిం కమిటీ ప్రధాన కార్యదర్శి, పట్టణ కాంగ్రెస్ నాయకుడు షాహిద్ పాషా స్వయంగా ముందుకు వచ్చారు.ఇది ఒక్కసారిగా చేసిన సహాయం మాత్రమే కాదు. గతంలో కూడా ఆయన సుభాష్నగర్ వినాయకుని నిమజ్జన ఊరేగింపుకు ట్రాక్టర్ అందించడమే కాకుండా, ప్రతి సంవత్సరం దాతగా సహకరిస్తూ వస్తున్నారు. ఈ నిరంతర సహకారం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

**"ఇంటి బయట అందరూ సమానమే" - షాహిద్ పాషా**

ఈ సందర్భంగా షాహిద్ పాషా మాట్లాడుతూ
"ఇంటిలోనే మతం, కులం.గడప దాటిన తర్వాత అందరూ సమానమే అన్న భావన నా మనసులో దృఢంగా నాటుకుంది. మా తల్లిదండ్రుల పెంపకం వల్లే ఈ ఆలోచన అలవాటు అయింది. మతపరమైన విభేదాలకు తావివ్వకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలి. ఇతర మతాల పట్ల గౌరవప్రదంగా వ్యవహరించడం సమాజ అభివృద్ధికి అవసరం. నా వంతుగా ఎల్లప్పుడూ శాంతి–సౌహార్ద వాతావరణం నెలకొనేలా ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతాను" అని తెలిపారు.
**స్థానికుల ప్రశంసలు** స్థానికులు ఆయన చేసిన సేవలను అభినందిస్తూ, "మతసౌభ్రాతృత్వానికి పాషా నిలువుటద్దంగా నిలుస్తున్నారు" అంటూ ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

# రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి పర్యటనకు వేములవాడ నుంచి కాషాయ శక్తి ప్రదర్శన

**- వేములవాడ - కరీంనగర్ తరలివెళ్లిన భాజపా నేతల వాహనశ్రేణి**



వేములవాడ (ప్రశ్న న్యూస్) బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన రామచందరరావు కరీంనగర్ తొలి పర్యటనను పురస్కరించుకొని వేములవాడలో కాషాయం హోరెత్తింది. కరీంనగర్ జిల్లాలో బుధవారం ఆయన పర్యటనలో భాగంగా వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో భారీగా వాహనాల ర్యాలీ వేములవాడ నుంచి



కరీంనగర్ బయలుదేరింది.భాజపా మాజీ జిల్లా అధ్యక్షులు ప్రతాపరామకృష్ణ ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి శుభారంభం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "కేంద్రమంత్రి బండి సంజయ్ సారథ్యంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ వేగంగా విస్తరిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు.ర్యాలీలో బూత్ అధ్యక్షులు, పట్టణ నాయకులు, శక్తివంతమైన కేడర్ భారీ సంఖ్యలో పాల్గొన్నారు. వందలాది బీజేపీ కార్యకర్తలు కాషాయ పతాకాలు ఎగురవేస్తూ, పార్టీ నినాదాలతో మార్మోగించారు. "భారతమాత కి జై", "బీజేపీ జిందాబాద్", "రామచందరరావు కే జై" వంటి నినాదాలు ర్యాలీ అంతా మార్మోగించాయి.ప్రత్యేక ఆకర్షణగా ర్యాలీకి అలంకరించిన వాహనాలు కనిపించాయి. ప్రధాన రోడ్లపై బీజేపీ జెండాలు, కాషాయ బ్యానర్లు ఎగురుతూ పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. ప్రజలు ర్యాలీని చూసేందుకు రోడ్లపక్కన గుమిగూడారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ముఖ్య నాయకులు, పట్టణ బూత్ కమిటీ అధ్యక్షులు, యువ మోర్చా కార్యకర్తలు సహా వందలాది మంది పాల్గొన్నారు. వేములవాడ నుంచి కరీంనగర్ వరకు ర్యాలీ సాగిన మార్గమంతా కాషాయ వాతావరణం నెలకొంది.కేంద్రమంత్రి బండి సంజయ్ మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతం దిశగా కృషి కొనసాగుతుందని, రాబోయే ఎన్నికల్లో గెలుపు సాధించడమే లక్ష్యం అని నేతలు స్పష్టం చేశారు.

## మాయ మాటలతో ముంచుతున్న

# ఇన్సూరెన్స్ కంపెనీలు

**- భరోసా పేరుతో దోపిడీ -ఆరోగ్య భీమా వలలో ప్రజలు**

**- ప్రకటనలలో భరోసా - వాస్తవంలో నిరాశ**

**- అనారోగ్య భయం - భీమా భ్రమ - మోసపోతున్న మధ్యతరగతి ప్రజలు**

"హెల్త్ ఇన్సూరెన్స్ అనే పేరు, కష్టకాలంలో రక్షణ కాదు, మోసపు ముళ్ల కంచెగా మారుస్తున్నారు. ఇన్సూరెన్స్ ఉన్న రోగి అంటే దొరికినంత దోచుకోవడమే ముఖ్యమన్నట్లు ఆస్పత్రులు పూర్తిగా దోచుకుంటున్నాయి. ఇటు ఇన్సూరెన్స్ కంపెనీలు అటు ఆసుపత్రులు రోగులను దోచుకోవడమే ప్రధాన లక్ష్యంగా ప్రజలను నిలువునా మోసం చేస్తున్నాయి. దీనిపై కఠినంగా వ్యవహరించవలసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి ఇలా ఉంది మన పాలకుల తీరు"

**( ఆర్ కె- ప్రశ్న న్యూస్ బ్యూరో)**




ఆరోగ్య భీమా పేరుతో మనకు భద్రత కల్పిస్తామంటూ, కష్టకాలంలో తోడుగా నిలుస్తామంటూ చక్కటి మాటలతో ఇన్సూరెన్స్ కంపెనీలు మోసగిస్తున్నాయనే వాస్తవం కళ్లకు కట్టినట్టుగా బయటపడుతోంది. హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను విక్రయించే సమయంలో ఇన్సూరెన్స్ కంపెనీలు, వారి ఏజెంట్లు వినియోగించే మాయ మాటలు, కల్పిత కథలు, ప్రకటనల్లో చూపించే అద్భుత హామీలు ఇవన్నీ నిజానికి కాగితాలపైనే నిలుస్తున్నాయి. అమలులో మాత్రం అంతంతనే సేవలు అందిస్తూ ప్రజలను నిలువునా మోసం చేస్తున్నాయి అయిన పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడు.

### ఆశతో పాలసీ కొనుగోలు, నిరాశతో ఎదురుచూపులు

ఒక మధ్య తరగతి కుటుంబం గురించి ఊహించండి. ప్రతి నెలా కష్టపడి సంపాదించిన జీతం నుండి కొంత మొత్తం కట్ చేసి, "భవిష్యత్ లో అనారోగ్యం వస్తే భారమవ్వకూడదు" అనే నమ్మకంతో ఆరోగ్య భీమా పాలసీ తీసుకుంటారు. "క్యాష్‌లెస్ హాస్పిటల్, నో టెన్షన్" అంటూ ఏజెంట్ మధురమైన మాటలతో మెప్పిస్తాడు. కానీ ఆ కుటుంబానికి నిజంగా కష్టసమయంలో ఆసుపత్రి బిల్లు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు మొదలవుతుంది అసలు కష్టాలు, కార్పొరేట్ హాస్పటల్ల దోపిడి ఇన్సూరెన్స్ కంపెనీల మోసాలు.

### నిబంధనల ఉచ్చు, పాలసీదారుల దురదృష్టం..

హెల్త్ ఇన్సూరెన్స్ పుస్తకంలో చిన్న అక్షరాలతో వ్రాసిన టెర్మ్స్ అండ్ కండీషన్స్ అసలు విషం ఏమిటంటే ప్రజలను మోసం చేసే జిమ్మిక్కులు ఇందులోనే ఉంటాయి అందుకోసమే అది చీమ కన్నా చిన్న అక్షరాలను జోడించి పెడతారు ఇన్సూరెన్స్ కంపెనల మోసగాళ్లు. ప్రి ఎగ్జిస్టింగ్ డిసీజ్ పేరుతో క్లెయిమ్ తిరస్కారం, వెయిటింగ్ పీరియడ్ పేరుతో నెలల తరబడి చెల్లింపుల నిరాకరణ,చిన్న తప్పును పెద్ద నిబంధనగా మార్చి "క్లెయిమ్ రిజెక్ట్" అనే కఠిన తీర్పు,చివరికి రోగి కుటుంబం ఇన్సూరెన్స్ ఉందనే నమ్మకంతో హాస్పిటల్‌లో అడ్మిట్ చేస్తే, బిల్లు చెల్లించడానికి అప్పులు చేసి, బంగారం అమ్ముకుని బ్రతుకుతున్నారు. ఏజెంట్లు, కంపెనీలు మాత్రం ఫోన్ కాల్స్‌కి సమాధానం ఇవ్వకుండా వదిలేస్తుంది. ఇలా ప్రజలను నిత్యం మోసం చేస్తున్న అనేక ఇన్సూరెన్స్ కంపెనీలు మన మధ్యనే ఎన్నో ఉన్నాయి. వాటిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోవడంతో



ప్రజలు రోజురోజుకి తీవ్రంగా నష్టపోతున్నారు.

### ప్రచారం వేరే - వాస్తవం వేరే..

ప్రకటనల్లో "ఫుల్ కవరేజ్ –క్యాష్‌లెస్ ఫెసిలిటీ" అంటారు. కానీ హాస్పిటల్ కౌంటర్ వద్ద రోగి బంధువులు వినేది ఒక్క మాటే %– % "పాలసీ ఆప్రూవల్ రాలేదు, ముందు బిల్లు చెల్లించండి." చివరికి ఆ భీమా పాలసీ ఉపయోగం లేని కాగితం ముక్కగానే మిగిలిపోతుంది. రోగి చికిత్స కోసం ఆసుపత్రిలో అనేక ఇబ్బందులు పడుతుంటే ఇన్సూరెన్స్ కంపెనీలు మాత్రం అప్రూవల్ ఇవ్వకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంటాయి. వెరిఫికేషన్ అవుతుంది ఇక వస్తుంది అగవస్తుంది అంటూ కాలక్షేపం చేస్తారు ఇన్సూరెన్స్ అప్రూవల్ వచ్చేవరకు ఆసుపత్రి లో రోగికి అసలు చికిత్స ఇవ్వరు ఇలా ఇన్సూరెన్స్ కంపెనీలకు డబ్బులు చెల్లించి మరి గాలిలో దీపంలా ప్రజల ప్రాణాలు నిలుస్తున్నాయి ఇన్సూరెన్స్ కంపెనీల మోసాలకు దాదాపుగా చాలామంది ప్రజలు బాధితులు గానే ఉన్నారు. ఇన్సూరెన్స్ పాలసీల పేరుతో ప్రతి సంవత్సరం రేటు పెంచి అందిన కాడికి దోచుకుంటున్నారు. ఎంత దోచుకుంటే అంత అన్నట్లు చిన్నచిన్న పాలసీలకు కూడా 10,000 పైననే ఉందంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవ చేయవలసిన ఇన్సూరెన్స్ కంపెనీలు కోట్ల లాభాలలో ఉన్నాయంటే ప్రజలను ఎంత భారీగా దోచుకుంటున్నాయో దానికి కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఎందుకు ఇచ్చి రెడ్ కార్పెట్ పరుస్తుందో ప్రజలే అర్థం చేసుకోవాలి.

### ప్రజలకు హెచ్చరిక, అవగాహన తప్పనిసరి..

నిపుణులు చెబుతున్న మాట స్పష్టంగా ఉంది. పాలసీ తీసుకునే ముందు అన్ని షరతులు చదవాలి. ఏజెంట్ల మాటలు నమ్మి సంతకం చేయకూడదు.ఇన్సూరెన్స్ కంపెనీపై నియంత్రణ కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణ కఠినంగా ఉండాలి.

ఇన్సూరెన్స్ కవరేజ్ అమౌంట్ పెంచి పాలసీ అమౌంట్ తగ్గిస్తే చాలామంది ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇన్సూరెన్స్ తీసుకుంటారు. లేదంటే "హెల్త్ ఇన్సూరెన్స్" అనే పేరు, కష్టకాలంలో రక్షణ కాదు – మోసపు ముళ్ల కంచెగా మారుతుంది.

## భూకంపంతో నష్టపోయిన

### అఫ్గానిస్థాన్‌కు ఇండియా ఆపన్నహస్తం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్):** అఫ్గానిస్థాన్‌లో సంభవించిన భారీ భూకంపం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ భూకంపం వల్ల సుమారు 800 మందికి పైగా మరణించారని.. 2800 మందికి పైగా గాయపడ్డారని తెలుస్తోంది. భూకంప తాకిడికి విలవిల్లాడుతున్న అఫ్టానిస్థాన్‌కు భారతదేశం ఆపన్నహస్తం అందించేందుకు ముందుకు వచ్చింది. అఫ్గానిస్థాన్ భూకంప బాధితులను ఆదుకునేందుకు అత్యవసర సహాయక సామగ్రిని పంపింది. ఈమేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేసింది. భూకంపం సంభవించిన నేపథ్యంలో అఫ్గానిస్థాన్‌కు భారతదేశం మానవతా సహాయం అందిస్తోంది అని ప్రకటించింది. అలానే ఇండియా నుంచి అఫ్గాన్ పంపుతున్న సహాయక సామగ్రి ఉన్న ట్రక్కుల ఫోటోలను కూడా షేర్ చేసింది. వీటిల్లో బియ్యం బస్తాలు, ఇతర ఆహార పదార్థాలు ఉన్నాయి. ఈ కష్ట సమయంలో అఫ్గానిస్థాన్కు అండగా ఉంటామని భారతదేశం స్పష్టం చేసింది.నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (ఎన్‌సీఎస్) ప్రకారం అఫ్గానిస్థాన్‌లో సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేలు మీద 6.3 నమోదైంది. పాకిస్తాన్‌లోని కొన్ని ప్రాంతాలలో కూడా భూ ప్రకంపనలు సంభవించాయని తెలుస్తోంది. అఫ్గానిస్థాన్ భూకంపం గురించి తాలిబాన్ అధికారి ఒకరు కీలక ప్రకటన చేశారు. ఇది గత దశాబ్దంలోనే అత్యంత తీవ్రమైన భూకంపం అని ప్రకటించారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి అని తెలిపారు. అఫ్గానిస్థాన్‌లో భూకంపం నేపథ్యంలో.. భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక ప్రకటన చేశారు. విపత్తు గురించి అఫ్గాన్ విదేశాంగ మంత్రి మౌలవి అమీర్ ఖాన్ ముత్తఖితో మాట్లాడినట్లు తెలిపారు. భూకంపం వల్ల ప్రాణాలు కోల్పోయిన వారికి జైశకంర్ సంతాపం తెలిపారు.

అలానే అఫ్గానిస్థాన్‌కు భారత్ ఇప్పటికే సహాయక సామగ్రిని పంపిందని వెల్లడించారు. 1000 కుటుంబాలకు సరిపడా టెంట్లు, 15 టన్నుల ఆహార పదార్థాలను కాబూల్ నుండి కునార్‌కు తరలించామని చెప్పారు. భారత రాయబార కార్యాలయం ఈ సహాయక చర్యలను పర్యవేక్షిస్తోందన్నారు. ఈ మేరకు జైశంకర్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'నేడు అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రి మౌలవి అమీర్ ఖాన్ ముత్తఖితో మాట్లాడాను. భూకంపం వల్ల ప్రాణాలు కోల్పోయిన వారికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేశాను. భారతదేశం ఈరోజు కాబూల్‌లో 1000 కుటుంబాలకు సరిపడా టెంట్లు పంపింది. 15 టన్నుల ఆహార పదార్థాలను భారత మిషన్ ద్వారా కాబూల్ నుండి కునార్‌కు వెంటనే తరలిస్తున్నాము. రేపటి నుండి భారతదేశం నుండి మరింత సహాయక సామగ్రి పంపుతాము. భూకంపంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. ఈ కష్ట సమయంలో భారతదేశం అఫ్గానిస్థాన్‌కు అండగా ఉంటుంది' అంటూ జైశంకర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## పనులు వదిలి పడిగాపులు కాసినా

# అందని యూరియా

**- ఆగ్రహంతో సొసైటీ సిబ్బందిని నిర్బంధించిన రైతులు**

**- సుమారు గంటపాటు సొసైటీ కార్యాలయం ముందు ధర్నా**

**- సొసైటీ సిబ్బందిని నిర్బంధించడంతో పోలీసుల రంగ ప్రవేశం**



**జూలూరుపాడు(ప్రశ్న న్యూస్)** యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. కేవలం 225 బస్తాలు ఉండడంతో జూలూరుపాడు రైతు సొసైటీ ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బుధవారం యూరియా కోసం. సహకార సంఘాల్లో రైతులకు సరిపోయేన్ని బస్తాలు ఇవ్వకపోవడంతో పొద్దంతా సాగు. పనులు వదులుకొని సొసైటీ గోడౌన్ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తున్నది. నాలుగైదు రోజులుగా పనిగట్టుకొని వస్తున్నా చివరికి యూరియా దొరకడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ కార్యాలయం వద్దకు బుధవారం తెల్లవారుజామునే చేరుకుంటున్న రైతులు ఆధార్ కార్డులు వరుసలో పెట్టి యూరియా బస్తాల కోసం పడిగాపులు కాస్తున్నారు. సొసైటీ కార్యాలయంలో యూరియా బస్తాలు సరిపడా లేకపోవడంతో రైతులు తమ వరకు వస్తాయో లేదోనని దిగులు చెందుతున్నారు. బుధవారం పలు గ్రామాల నుంచి రైతులు సొసైటీ కార్యాలయం వద్దకు వచ్చినా. సీరియల్ ఉన్న రైతులకు మాత్రమే బస్తాలు ఇస్తుండడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

### - అగ్రహంతో సొసైటీ సిబ్బందిని నిర్భందించిన రైతులు..

సొసైటీ కార్యాలయం వద్ద బుధవారం క్యూలైన్ లో గంటల తరబడి నిలబడిన రైతులు యూరియా బస్తాలు దొరకకపోవడంతో అధికారుల తీరుపై రైతులురైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు కార్యాలయం ముందు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నా సరిపడా స్టాక్ దొరక్క తీవ్ర నిరాశకు గురై, సొసైటీ సిబ్బందిని కార్యాలయంలో నిర్భందించి కార్యాలయం షెటర్లు మూసివేసి కార్యాలయం ముందు రైతులు బైటయించి రైతులకు సరిపడా యూరియా అందించాలని సుమారు గంట వరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ. పంటలకు కీలకమైన యూరియా అందక ఇబ్బందులకు



గురవుతున్నామని. యూరియా అందక పంటల పెరుగుదలపై ప్రభావం చూపుతుందనే అందోళన వ్యక్తమవుతోంది. యూరియా కోసం తెల్లవారుజామున ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట ఉదయం 5 గంటల నుంచి క్యూలైన్లో నిలబడినా, యూరియా ఎరువులు సరిపడా అందక ఖాళీ చేతులతో తిరిగి వెళ్తున్నామని పగలు రాత్రి తిరిగినా యూరియా దొరకడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### - సిబ్బందిని నిర్బంధించడంతో పోలీసులు రంగ ప్రవేశం.

జూలూరుపాడు మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం వద్ద రైతులకు సరిపడ యూరియా అందించడం లేదని ఆగ్రహించిన రైతులు సొసైటీ సిబ్బందిని కార్యాలయం నుండి బయటకు రానివ్వకుండా నిర్బంధించి ధర్నా నిర్వహించారు విషయం తెలుసుకున్న జూలూరుపాడు పోలీసులు సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకొని రైతులతో చర్చించి సోసైటీ కార్యాలయం షట్టర్ల తీసి సొసైటీ సిబ్బందితో మాట్లాడి నిల్వ ఉన్న 225 బస్తాలను ఒక్కో రైతుకి ఒక్కో బస్తాగా రైతులకు పంపిణీ చేసేలా చెప్పడంతో రైతులు ధర్నా విరమించి క్యూ లైన్లో నిలబడి యూరియా ఒక్కో రైతు ఒక్కో బస్తా యూరియా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా అందజేసేలా సొసైటీ సిబ్బందిని. పోలీసు సిబ్బందిని కోరారు.

# ఈ క్రేజ్ ఎన్నాళ్ళు..?

**- ఇప్పుడే మొదటి పేజీల్లో తర్వాత షర్మిల తరహాలోనే**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కల్వకుంట్ల కవిత ఇక బయటకు వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. అయితే ఆమె భవిష్యత్ ప్రణాళిక మాత్రం కొత్త పార్టీ అన్నది మాత్రం అర్థమవుతుంది. బీఆర్ఎస్ నాయకత్వం తనపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని కవిత జీర్ణించుకోలేకపోతున్నారు. తన తండ్రి చుట్టూ దయ్యాలున్నాయని, తన తండ్రి దేవుడని అన్నప్పటికీ కేసీఆర్ కుమార్తె విషయంలో వెనక్కు తగ్గలేదు. పార్టీ కోసం కల్వకుంట్ల కవితను సస్పెండ్ చేశారు. అసలే తనకు పార్టీలో జరుగుతున్న అన్యాయానికి రగిలిపోతున్న కవిత సస్పెన్షన్ తో మరింతగా రగిలిపోతున్నట్లే ఉంది. అందుకే కవిత పార్టీకి గుడ్ బై చెప్పాలని నిర్ణయించుకుంది. దీంతో పాటు పార్టీ తనకు ఇచ్చిన ఎమ్మెల్సీ పదవి కూడా త్యజించి జనంలోకి వెళ్లేందుకు సిద్ధమయినట్లు కనిపిస్తుంది.

### - ఇప్పుడు చేసే విమర్శలకు..

కల్వకుంట్ల కవిత తన తండ్రి కేసీఆర్ పై యుద్ధం కాకుండా, బీఆర్ఎస్ పార్టీ నేతలపైనే వార్ ప్రకటించేందుకు సిద్ధమయినట్లు కనపడుతుంది. ఇప్పటికిప్పుడు కాకపోయినా కవిత కొత్త పార్టీ ప్రకటించే అవకాశాలను ఎవరూ కొట్టిపారేయలేరు. తన తండ్రి కేసీఆర్ తనపై సస్పెన్షన్ నిర్ణయాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్నారని ఆమెకు తెలుసు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి సీబీఐ విచారణతో చికాకులో ఉన్న పెద్దాయనను కవిత మరింత చికాకు పెట్టినట్లయింది. అయితే కవిత చాలా రోజులుగా పార్టీపైన, నేతలపైన విమర్శలు చేసినా కేసీఆర్ ఓపిక పట్టారు. పెద్దగా పట్టించుకోనట్లు వదిలేశారు. అయితే కాళేశ్వరం విషయంలో కవిత చేసిన కామెంట్స్ ఆయననే ఇబ్బంది పెట్టాయి.

### - సొంత పార్టీ పెట్టినా..

కనీసం బంధువులని లేకుండా, పార్టీలో తనకు ముఖ్యులని తెలిసినా కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలతో ఆయన ఇబ్బంది పడ్డారు. అందుకే ఆయన తన భార్యతోనూ చర్చించారు. కుమార్తె అని చూస్తూ ఊరుకుంటే రానున్న ఎన్నికలకు ముందు మరింత మంది నేతలు రెచ్చిపోయే అవకాశాలు లేకపోలేదు.

అందుకే కవితను సస్పెండ్ చేసి ఆమె భవిష్యత్ లో చేసే విమర్శలకు ప్రాధాన్యత లేకుండా ప్రస్తుతానికి అయితే చేయగలిగారు. కవిత ఇప్పుడు ఏం మాట్లాడినా ప్రజలు పెద్దగా పట్టించుకోరు. అయితే ఒకటి మాత్రం నిజం. ఏపీలో వైఎస్ షర్మిలను ఎవరూ పట్టించుకునే వారు లేరు. తొలినాళ్లలో ఉన్న క్రేజ్ రానురాను తగ్గిపోయింది.

కవిత విషయంలోనూ అదే జరుగుతుంది. సొంత పార్టీ పెట్టినా కల్వకుంట్ల కవిత చేతులు కాల్చుకోవడం తప్ప మరొక ప్రయోజనం ఉండదన్నది వాస్తవం. మరి కవిత తీసుకునే నిర్ణయం ఆమెకే వదిలేసిన, రాజకీయంగా ఏదో ఒకరోజు మళ్లీ కారు ఎక్కాల్సిందేనని చెప్పక తప్పదు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588